నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శనివారం | 28 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవ తెలంగాణ-నర్సాపూర్



రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను, సైబర్ మోసాలు జరగకుండా వాటిన అరికట్టేందుకు అవగాహన సీసీ కెమెరాలు ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. అదేవిధంగా ప్రతి దరఖాస్తును తీసుకొని వారికి సరైన న్యాయం జరిగేలా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి, సీఐ జాన్ రెడ్డి, ఎస్సై లింగం సిబ్బంది ఉన్నారు.

పీజీ బాయ్స్ గర్ల్స్ హాస్టల్లో మెస్ సౌకర్యం కల్పించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్

నవతెలంగాణ-సిద్ధిపేట కలెక్టరేట్



జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట సిద్దిపేటలో ఉన్న పీజీ బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్‌లో మెస్ సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా ఉన్న పీజీ హాస్టల్స్‌లకు మెస్ సౌకర్యం లేకపోవడం వల్ల ఇతర జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు బోజన సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే మెస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దానితో పాటు పీజీ కాలేజీకి గేట్ కూడా లేదన్నారు. ప్రయోగశాల కూడా లేదన్నారు. కావున వెంటనే ప్రభుత్వం, అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణు, రవి, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంఘాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

-కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-సిద్దిపేట



తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 14 రంగాల కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీజీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్పల్లి చంద్రం మాట్లాడుతూ ప్రపంచమంటేనే రైతులు, భవన నిర్మాణ కార్మికులన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లోని భవన నిర్మాణ కార్మికులు దాదాపు 60 లక్షల మంది కార్మికులు ఉన్నారనీ, ప్రభుత్వం కార్మిక మంత్రిత్వ శాఖను పటిష్టం చేసి, మంత్రిని నియమించాలని కోరినట్లు తెలిపారు. వారికి ఎటువంటి ప్రమాదాలు జరిగినా లెక్కచేయకుండా తమవంతు పనిని పూర్తిచేయడంలో నిమగ్నులయ్యారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 30 లక్షల మందిని మాత్రమే కార్మికులుగా గుర్తింపుకార్డులు ఇవ్వడం జరిగిందని, మిగిలిన అర్హులైన కార్మికులను కూడా సత్వరమే గుర్తింపుకార్డులను అందించాలని కోరారు. ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చల్మెల రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి కల్లెడి గంగాధర్, దశరథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారం మహేందర్, ప్రచార కార్యదర్శి నల్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పెద్దలకా.. పేదలకా?

ప్రజాపాలనలో సామాన్య, మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా సర్కారు దాడి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపణలు

నవతెలంగాణ-సంగారెడ్డి



'హైడ్రా పెద్దలకా.. లేక పేదలకా? ప్రజాపాలనలో సామాన్య, మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా సర్కారు దాడి కొనసాగుతున్నది. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్టు హైడ్రా పని ఉంది' అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నేతలు, పలుకుబడి ఉన్న వ్యక్తులకు నోటీసులతో సరిపెడుతున్న సర్కారు.. పేదోడి గూడుపై మాత్రం కర్కశంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వానికి దమ్ముంటే పర్మిషన్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. ఇల్లు కట్టుకోవడానికి అనుమతులు ఇచ్చి.. వాటి నుంచి వచ్చిన ఆదాయం ప్రభుత్వం సొమ్ము చేసుకొని.. మళ్ళీ ఆ ఇండ్లనే కూల్చడం ఎంతవరకు కరెక్ట్ అన్నారు. ప్రజాపాలనలో సామాన్యుడి గూడుపై సర్కారు దాడి చేస్తున్నదన్నారు. రూపాయి రూపాయి కూడబెట్టి స్థలం కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టారని.. అలాంటి వారిని అకస్మాత్తుగా రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా వల్ల పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు కుదేలవుతున్నాయన్నారు. వారికి హైడ్రా భరోసా కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో సీడీసీ మాజీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ లైబ్రరీ చైర్మెన్ నరహరి రెడ్డి పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రతీ సోమవారం తహసీల్‌లో ప్రజావాణి నిర్వహించాలి

-జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

మొగుడంపల్లి తహసీల్దార్ కార్యాలయం, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-జహీరాబాద్



అధికారులు నిబ్బతతో విధులు నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలని.. ధరణి భూ సమస్యలు పెండింగ్‌లో ఉంచొద్దని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలో మొగుడంపల్లి తాసిల్దార్ కార్యాలయాన్ని, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి ఫైల్స్ పెండింగ్‌లోఉండొద్దన్నారు. ఈ మేరకు ఆయా మండలాల తహసీల్దార్‌లు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి పంపే ఫైల్స్‌కు అన్ని ధ్రువపత్రాలు జత చేసి పంపించాలన్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి మండల పరిధిలోని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మొగుడంపల్లి లోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. టీచర్లు చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని.. మెనూ ప్రకారం ప్రతిరోజు భోజనాలు పెట్టాలని, కిచెన్, డైనింగ్‌హాల్ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైని కలెక్టర్ మనోజ్, ఆర్డీవో రాజు, సంబంధిత శాఖ ల అధికారులు , గురుకుల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ సెక్రటరీ

నివాస ధృవీకరణ పత్రం కోసం రూ.5వేలు డిమాండ్

నవతెలంగాణ-కొండాపూర్



కొండాపూర్ పంచాయతీ కార్యదర్శి మహ్మద్ షకీల్ రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా ఓ వ్యక్తికి నివాస ధృవీకరణ పత్రం ఇవ్వడానికి పంచాయతీ కార్యదర్శి షకీల్ రూ.5వేలు డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని సదరు వ్యక్తి ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో శుక్రవారం రోజున ఆ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ సీఐ రమేష్ మాట్లాడుతూ.. ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నారింజ వాగులో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు



నవతెలంగాణ-జహీరాబాద్

నారింజ వాగులో గురువారం మధ్యాహ్నం గల్లంతైన వ్యక్తి కోసం శుక్రవారం కూడా గాలింపు చర్యలను చేపట్టారు. కర్నాటక రాష్ట్రం బీదర్, మైలూర్ కాలనీకి చెందిన ఇస్మాయిల్, షాకీర్ ఇద్దరు కలిసి హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా.. గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బుచ్చినెల్లి గ్రామ శివారులో నారింజ వాగు దాటుతూ ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయారు. ఇస్మాయిల్‌ను స్థానికులు రక్షించగా.. షాకీర్ నీటిలోనే గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం గురువారంతో పాటు రెండోరోజైనా శుక్రవారం కూడా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు చిరాగ్ పల్లి యస్.ఐ రాజేందర్ రెడ్డి తెలిపినారు. గజ ఈతగాళ్లతో పాటు గ్రామస్తులను కూడా తీసుకొని వాగులో గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు.

ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నా..

ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం

- జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ
- చెక్కుల పంపిణీ చేసే సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల రసాభాస

నవతెలంగాణ-చేర్యాల

ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ తెలిపారు.సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలో చేర్యాల,కొమురవెల్లి, మద్దూరు,దూల్మిట్ట మండలాలకు చెందిన 239మంది లబ్దిదారులకు శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హల్ లో కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్కులను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ పంపిణీ చేశారు.ఈ సంధర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ పనిచేస్తున్నారన్నారు. ప్రజలకు ప్రయోజనం కలిగే పథకాలను ఏ పార్టీ ప్రవేశపెట్టినా పార్టీలకతీతంగా ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరర్ రెడ్డి ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, రైతు రుణమాఫీ, 108, 104 సర్వీసులు వంటి పథకాలను రాష్ట్ర అవతరణ అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ కొద్ది రోజులు ఆలస్యమైనప్పటికీ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రతిపక్ష పార్టీల పాత్ర ఎంతో కీలకమని,ప్రతిపక్ష ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేర్యాల ప్రాంతంలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకుని వస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీలు వేరైనా మంత్రి కొండా సురేఖ అక్కతో కొట్లాడి చేర్యాల ప్రాంత సమస్యలు పరిష్కరించుకునే అవకాశం తనకు ఉందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. కొండా సురేఖ అల్లా టప్పా నాయకురాలు కాదని ప్రజా సమస్యలపై అవగాహన అన్న ప్రజా నాయకురాలని కొనియాడారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య రసాభాస

లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసే సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య రసాభాస నెలకొంది. చెక్కులు పంపిణీ చేస్తున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులు తులం బంగారం ఎప్పుడిస్తారని ప్లకార్డులు ప్రదర్శించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ నాయకుల ప్లకార్డులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు కుర్చీలు ప్రదర్శించడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఇరువర్గాల నాయకులను చెదరగొట్టే ప్రయత్నం చేయడం, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



డబల్ బెడ్ రూమ్ జాబితాపై సర్వే చేయాలి

- ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా వినతిపత్రం
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో డబల్ బెడ్ రూమ్ జాబితాలో అనేకమంది అనర్హులకు చోటు దక్కిందని అర్హుల పేర్లు రాలేదని కావున డబల్ బెడ్ రూమ్ జాబితాపై సర్వే చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చి పేదలందరికీ న్యాయం చేయాలని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి రెండు జాబితాలు వచ్చిన పేర్లు మూడో జాబితాలో రాలేదని గజ్వేల్‌లో స్థానికంగా గుర్తింపు కార్డు లేని వారు, సొంత ఇల్లు స్థలాలు కలిగిన వారు ఒకే ఇంట్లో ముగ్గురు నలుగురు పేర్లను ఎంపిక చేసి జాబితా తయారు చేశారని వారి పేర్లు డ్రా తీశారని డబల్ బెడ్ రూమ్‌ల ఎంపికల్లో భారీ మోసాలు జరిగాయని వాటన్నిటిని సమగ్రంగా సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక మంది పేర్లు ఆర్డీవో, కలెక్టర్ మంత్రులకు జాబితాను అందజేశారని, అనర్హుల పేర్లు తొలగించి గతంలో పట్టా సర్టిఫికెట్లు పొంది అద్దెకు ఉంటున్న వారికి మొదటి ప్రాధాన్యతగా ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సమగ్రంగా సర్వే నిర్వహించని అధికారులపై చర్యలు తీసుకోని, పేదలందరికీ న్యాయం చేయాలని, లేనిచో ప్రజలు ఆందోళన బాట పడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు వెంకట చారి, డబల్ బెడ్ రూమ్‌ల బాధితులు పద్మ, కవిత, లక్ష్మి, మంజుల, వసంత, నర్సింహులు, వెంకటేష్, భాషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చైతన్యం ప్రపంచంలోనే గొప్పది

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం
- ఉద్యమ పోరాట ఘట్టాలను ఒక పుస్తక రూపంలో తేవాలి

నవతెలంగాణ-సిద్దిపేట



రాష్ట్ర ఏర్పాటు కోసం తెలంగాణలో ప్రజల చైతన్యం ప్రపంచంలోనే గొప్పదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గురువారం రాత్రి స్థానిక ఎన్జీవో భవన్లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో, జేఏసీ నాయకుడు పెద్ది రాజు అధ్యక్షతన జరిగిన సభలో స్థానిక ఉద్యోగ, ఉపాధ్యాయ, అడ్వకేట్ జేఏసీ, ప్రజా పౌర సంఘాల నాయకులు ప్రొఫెసర్ కోదండరాంని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ కొత్త తోవ వెతుక్కుంటుందని, భవిష్యత్ తెలంగాణ నిర్మాణం కోసం చిత్తశుద్ధితో పని చేద్దామని పిలుపునిచ్చారు. మనకు ఎవ్వరి మీద కోపం లేదని, తెలంగాణ ప్రగతి కోసం చిత్తశుద్ధితో కలిసి పనిచేద్దామని సూచించారు. ఎవ్వరి వేదికలు వారికి ఉంటాయని, వేదికలు, వ్యక్తులు వేరైనా లక్ష్యం ఒక్కటేనని, భావి భారత తెలంగాణ అభివృద్ధి ముఖ్యమని పేర్కొన్నారు. ఉద్యమకారుల సమస్యలు చర్చించేందుకు ఒక వేదిక అవసరమన్నారు. ఎమ్మె ల్సీగా ఉద్యమకారుల పక్షాన పనిచేయాలని, ప్రభుత్వంతో మాట్లాడి అన్ని వర్గాలకు చెందిన సమస్యలు పరిష్కరించాలనే ఆశతో ఆత్మీయ సమ్మేళనం పేరిట సన్మానం చేస్తున్నట్టుగా ఉందని, సన్మానం తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. మన పోరాట ఘట్టాలను రికార్డు చేయాలనీ, ప్రతీ ప్రాంతం వాళ్లు తమ ఉద్యమ పోరాటాలను పుస్తక రూపంలో తీసుకురావడం అత్యంత ముఖ్యమని అన్నారు. అనంతరం పెద్ది రాజు మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరాం నిరాడంబరమైన వ్యక్తి ఎమ్మెల్సీగా నియమించడం తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారులను గౌరవించడం అభిప్రాయపడ్డారు. సభలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ప్రొఫెసర్ కోదండరాం సేవలను, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో చేసిన కృషిని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. పలు సమస్యలపై విజ్ఞాపన పత్రాలు పలువురు అందజేశారు. వాటిని పరిశీలించి, సంబంధిత అధికారులకు సిఫార్సు చేసి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తాననీ ప్రొఫెసర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉద్యోగులు విక్రం రెడ్డి, కొండి మల్లారెడ్డి, అంజయ్య, శ్రద్ధానందం, అయిత అంజయ్య, పాల్గొన్నారు.

బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన హరీశ్ రావు

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీష్, ఉపాధ్యక్షులు సంగు పురేందర్, గ్రామ అధ్యక్షుడు రచ్చ సిద్ధుతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ఆవిష్కరించారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందని, విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని హరీశ్ రావు అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ కి తెలంగాణ ఉద్యమానికి చాలా దగ్గరి సంబంధం ఉందని, మలి దశ ఉద్యమాల్లో రాజీనామాలు చూశాం కానీ 1969 సంవత్సరంలోనే తన మంత్రి పదవిని తెలంగాణ కోసం తెలంగాణ నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని చెప్పి రాజీనామా చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అంతేకాకుండా మలి దశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 97 ఏండ్ల వయసులో హైద్రాబాద్ నుంచి డిల్లీకి పోయి జంతర్ మంతర్ దగ్గర చలిని సైతం లెక్కచేయకుండా తెలంగాణ కోసం కొట్లాడి, తన ఇంటిని పార్టీ ఆఫీస్ కు ఇచ్చిన మహనీయుడిని అన్నారు. ఆయన పేరులోనే కొండా ఉందని... కానీ నిజంగా కొండంత గొప్ప వ్యక్తిత్వం కలిగినటువంటి వ్యక్తి అని తెలిపారు. తెలంగాణ కోసం పోరాడుతూ, పద్మశాలిలా అభివృద్ధి కోసం, అభ్యున్నతి కోసం, హక్కుల కోసం కూడా తన చివరి శ్వాస వరకు కొట్లాడిన వ్యక్తి బాపూజీ అని అన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా పని చేశారని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాడగానే మాజీ సిఎం కెసిఆర్ బాపూజీ జయంతిని, వర్ధంతిని అధికారికంగా జరుపాలని ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. అంతే కాకుండా సిద్దిపేట జిల్లాలో ఉన్నటువంటి హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ నామకరణం చేసి ఆయన కీర్తి ప్రతిష్టలను ఎప్పటి ఉండేలా చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. యావత్ తెలంగాణ ప్రజానీకం గర్వించదగి నటువంటి బిడ్డ బాపూజీ అని వారి బాటలో మనం ముందు పోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రాథమిక పాఠశాలను బలోపేతం చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్ కిరణ్ డిమాండ్

నవతెలంగాణ-జగదేవపూర్



టీఎస్‌యూటీఎఫ్ జగదేవపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో పలు పాఠశాలలను శుక్రవారం సందర్శించి ఉపాధ్యాయులను ఉద్దేశించి టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్ కిరణ్ మాట్లాడుతూ జీఓ 25ను సవరించి, ప్రాథమిక పాఠశాలను బలోపేతం చేయాడానికి ప్రాథమిక పాఠశాలల్లో తరగతికొక టీచరు ఉండాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలని అన్నారు. జీఓ లోని నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయటం వలన పాఠశాలలకు నష్టం కలుగుతుం దని, పలు పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి మూసివేతకు దారితీస్తాయన్నారు. జీవో 25 లోని నిబంధనలు సవరించాలని ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులకు బోధ నేతర పని భారం తగ్గించాలని, 317 సమస్యలన్నీ పరిష్కరించాలని ఉపాధ్యాయుల పెండింగ్ బిల్స్ అన్నింటిని వెంటనే క్లియర్ చేయాలని, గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరించాలని, కేజీబీవీ సమస్య పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.రేపు జిల్లా కేంద్రం సిద్దిపేట యూఎస్ పీఎస్ భాగస్వామ్య సంఘాల ఆధ్వర్యంలో జీఓ25ను సవరించాలని జరుగుతున్న ధర్నాను విజయవంత చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చేరియాల రాంచంద్రం, కృష్ణ ,మండల నాయకులు పర్శరాములు, శ్రీశైలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటు జీ.ఓ.25ను సవరించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాదగిరి

నవతెలంగాణ-మద్దూరు



విద్యాశాఖలో ఉన్న ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడం కొరకు సర్దుబాటు పేరుతో విడుదల చేసిన అశాస్త్రీయమైన జీవో 25ను వెంటనే సవరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దూల్మిట్ట మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలో వివిధ పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటుకు ముందే బదిలీ అయిన యస్‌జీటీలను రిలీవ్ చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో తరగతికొక టీచరు ఉండాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలని, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20గా నిర్ణయించాలని, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మీడియం వారీగా లెక్కించాలని, అదనపు ఉపాధ్యాయులను 1:30 నిష్పత్తిలో లెక్కించాలని, జీవో 25ను సవరించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి బి. గణేష్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రంగు రాజమల్లు, ఇర్రి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం.మల్లేశం
- పరిశ్రమల వద్ద జీపుజాత ద్వారా ప్రచారం

నవతెలంగాణ-కొండాపూర్



కాంట్రాక్ట్ వర్కర్స్, ఔట్సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నేడు చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం.మల్లేశం పిలుపునిచ్చారు. ఈ మేరకు క్లస్టర్ వ్యాప్తంగా ఆటోజాత ద్వారా వివిధ పరిశ్రమల వద్ద శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండాపూర్ క్లస్టర్ పారిశ్రామిక ప్రాంతంలోని కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్‌పర్మినెంట్ కార్మికులు ఏండ్ల తరబడి పనిచేస్తున్నా.. వారిని పరిశ్రమ యాజమాన్యాలు పర్మినెంట్ చేయడం లేదని.. వెంటనే వారందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా 12 గంటల పని అమలు చేస్తూ శ్రమదోపిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను కాలరాసే లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. 8 గంటల పని దినం అమలు చేయాలన్నారు. అదనపు పనికి అదనపు వేతనం చట్ట ప్రకారం డబుల్ ఇవ్వాలని, కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్, బోనస్, గ్రాట్యుటీ అమలు చేయాలని, అపాయింట్మెంట్ లెటర్స్ గుర్తింపు కార్డులు ఫ్లే సిప్పులు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయన్నారు. కార్మికుల పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కార్మిక చట్టాలను సవరించి వేతనాలను పెంచాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నేడు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఈ ధర్నాలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అప్పటికి ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం చేయకపోతే ఈనెల 30న లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కొండాపూర్ క్లస్టర్ కన్వీనర్ బాబురావు, సీఐటీయూ క్లస్టర్ నాయకులు కొండల్ రెడ్డి, రమేష్, వెంకట్ రెడ్డి,రమేష్, కృష్ణ, మధుకర్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల రైతు రుణమాఫీ వెంటనే చేయాలి

- కొత్త రుణాలు ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు

నవతెలంగాణ-జోగిపేట



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి. జయరాజు డిమాండ్ చేశారు. జోగిపేటలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నాడని.. వాస్తవానికి రైతులకు పూర్తిగా మాఫీ కాలేదన్నారు. రైతులకు బ్యాంకర్లు కొత్త రుణాలు వెంటనే ఇవ్వాలన్నారు. జిల్లాలో అనేకమంది రైతులు తమ రుణాలు మాఫీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రైతుభరోసా కింద జమ చేయాల్సిన డబ్బులు నేటికి జమ చేయకపోవడంతో రైతులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. లేనిపక్షంలో రైతాంగం తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతి మేలా మాణిక్యం, జి. సాయిలు, ఆందోల్ డివిజన్ కన్వీనర్ డి. విద్యాసాగర్ ఏరియా కమిటీ సభ్యులు నాగభూషణం, రాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి

జిల్లా పిఆర్టీయూ అధ్యక్షుడు ఆకుల మాణయ్య

నవతెలంగాణ-జోగిపేట

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తున్నదని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య అన్నారు. జోగిపేటలో శుక్రవారం ఏర్పాటుచేసిన మండల, పట్టణ పీఆర్టీయూ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లి వాటికి పరిష్కార మార్గాలు చూపిస్తున్న ఏకైక సంఘం పిఆర్టియు అన్నారు. పెండింగ్లో ఉన్న డీఏ, పిఆర్సీ ఇప్పించేందుకు ప్రభుత్వంతో సంఘం చర్చలు జరుపుతున్నామన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించేందుకు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అనంతరం పిఆర్టియు పట్టణ అధ్యక్షులుగా, గ్రామీణ అధ్యక్షులుగా ఎస్ నరోత్తం కుమార్, బి రాజమల్లుతోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
శనివారం | 28 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

మాజీ సర్పంచ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని ఎర్రారం గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాదులోని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో కేక్ కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మంత్రిని శాలువాతో సన్మానించారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ తినిపించారు.కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మెన్ ఎం. పద్మనాభరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శివరాజ్, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, రాజశఖర్ రెడ్డి, నాయకులు శివ శకర్ గౌడ్, మల్లేశం యాదవ్, అనీఫ్, సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ టౌన్ యూత్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్



నవతెలంగాణ-సదాశివపేట

బీఆర్ఎస్ సదాశివపేట టౌన్ యూత్ ప్రెసిడెంట్‌గా కొత్తకొండ శ్రీకాంత్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నివాసంలో నియామక పత్రాన్ని శ్రీకాంత్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా యువ నాయకులను కలుపుకెళ్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ చింతా గోపాల్, మైనార్టీ నాయకులు కామెల్ అన్సారీ, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

14 వేల నగదు, 8 బైక్‌లు, 3ఫోన్లు స్వాధీనం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

పేకాట స్థావరంపై బొల్లారం పోలీసులు దాడి చేసి 9 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. బొల్లారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాజీపల్లి సర్వే నెంబర్ 181 గుట్టపైన అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పేకాటఆడుతుండగా 9 మందిని పట్టుకు న్నారు. వారి వద్ద నుంచి రూ.14 వేల నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలకు జిన్నారంవిద్యార్థులు



నవతెలంగాణ-జిన్నారం

హైదరాబాద్ క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నేటి నుంచి వరంగల్‌లో జరగనున్న అండర్ -19 ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటల్లో జిన్నారం గురుకులం క్రికెట్ అకాడమీ విద్యార్థులు కే.ప్రతాప్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు, డి.అంజి ఉమ్మడి మెదక్ జిల్లాల తరుపున ప్రాతినిధ్యం వహించను న్నారు. ఈ విషయాన్ని జిన్నారం గిరిజన గురుకుల బాలుర గురుకులం ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా సదరు విద్యార్థులను జిన్నారం కళాశాల ప్రిన్సిపల్ వెంకటనారాయణ ,వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, కోచ్ మహేష్ గురుకులం ఉపాధ్యాయ బృందం సిబ్బంది అభినందించారు.


నాలా కబ్జాపై వెంచర్‌కు నోటీసులు



నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారి 65 పక్కన గల శిల్పా వెంచర్‌కు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంతకుముందు ఎప్పుడూ లేని విధంగా జాతీయ రహదారిపై వర్షం నీరు వస్తుండడంతో.. పక్కనే ఉన్న శిల్పా వెంచర్ నాలాను కబ్జా చేసినట్టు స్థానికులు గమనించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో తహసీల్దార్ సరస్వతి శుక్రవారం రోజున వెంచర్‌ను పరిశీలించారు. సర్వే నెంబర్ 626,627,628లలో నాలాను శిల్పా వెంచర్ కబ్జా చేసినట్టు గుర్తించారు. దాంతో ఆ వెంచర్ యజమానికి నోటీసులు ఇచ్చారు. కాలువ 20 మీటర్లు ఉండాలని.. సర్వే చేసి హద్దులు మార్కింగ్ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఆ తర్వాత బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

మునిపల్లి నూతన విద్యాధికారిగా బీంసింగ్



నవతెలంగాణ-మునిపల్లి

మునిపల్లి మండల విద్యాధికారిగా బుదేరా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీంసింగ్ నియమితులయ్యారు. ఇదివరకు కొండాపూర్ మండల విద్యాధికారిగా పనిచేసిన ఆయన.. బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన దశరథ్.. కొండాపూర్ మండల విద్యాధికారిగా బదిలీఅయ్యారు. ఈ సందర్భంగా భీంసింగ్ మాట్లాడుతూ.. మండలంలోని పాఠశాలల అభివృద్ధికి విద్యా ప్రమాణాల పెరుగుదలకు కృషి చేస్తానన్నారు. కాగా ఆయనకు ఆయా ఉపాధ్యాయ సంఘాలు స్వాగతం పలికాయి.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



నవతెలంగాణ-జోగిపేట

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జోగిపేట అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం ఫైర్‌సేఫ్టీపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా కాపాడుకోవాలనే విషయాలను సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రజిత, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, అధ్యాపకులు విట్టల్, శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, మల్లేశం, శ్రవణ్ కుమార్, రాజ్ కుమార్, జక్కుల మల్లేశం, శశికళ, అనిత పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఏడీఏ బిక్షపతి అన్నారు. జహీరాబాద్ మండలంలోని హుగ్గేల్లి గ్రామంలో శుక్రవారం చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాన్ని ఆయన పరిశీ లించారు. అనంతరం పాఠశాల ఆవరణలో గ్రామస్తులు, వివిధ శాఖల అధికా రులతో కలసి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామంలో మురుగినీరు చేరి.. ప్రజలు అనారోగ్యాలకు పాలవుతున్నారన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ పారిశుధ్యాన్ని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఈఓ రాథోడ్‌కు కార్పొరేటర్ అభినందనలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం మండలం నూతన మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాథోడ్‌ను స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్ ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యాభివృద్ధి, పాఠశాలల బాగు కోసం నూతన ఎంఈఓ కృషి చేయాలని కార్పొరేటర్ కోరారు.


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1984-85 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు స్థానికంగా గల శ్రీ చైతన్య హై స్కూల్‌లో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వ హించారు. ముందుగా గురువులను ఆహ్వానించి శాలువాలతో సత్కరిం చారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ బృందం రామ్ రెడ్డి, రాజ మల్లయ్య జంగారెడ్డి, సదాశివరావు, నరసింహులు, కృష్ణయ్య, యాదవ చారి, ఇనాయితలి, కమలమ్మ, పున్నారావు, లక్ష్మా గౌడ్ హాజరయ్యారు. శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల సీబీఎస్ఈ, స్టేట్ పాఠశాలల నిర్వాహకులు నరసింహ, కుటుంబ సభ్యులు ఈ నిర్వాహణ చూసుకున్నారు.

భగత్‌సింగ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-సదాశివపేట

దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీవైఎఫ్ఐ సదాశివపేట కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. స్వతంత్ర పోరాటంలో ముందు వరుసలో నిలిచిన మహోన్నత నాయకుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరుడు అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు యండి యూసుఫ్, రాజు, రమేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆదర్శప్రాయం

ఘనంగా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు...



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన తొలి, మలి దశ పోరాటాల్లో కీలక పాత్ర పోషించడంతోపాటు తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొనియాడారు. పటాన్‌చెరు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళ్లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి తరానికి కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రను తెలియజేయాలన్న లక్ష్యంతో పటాన్చెరు బస్టాండ్ ఆవరణలో విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అతిత్వరలో విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, శీనయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అశోక్, వేముల రమేష్, రఘు రాములు, సునీల్,జగదీష్, శ్రీ రామ్, అశోక్, కృష్ణ, లక్ష్మణ్, కృష్ణ, సదానంద, ప్రసాద్, రాజు, సతీష్, నామ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐడిఏబొల్లారం : బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. లక్ష్మణ్ సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, మేనేజర్ నిర్మల రెడ్డి,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జోగిపేట : స్వాతంత్ర సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం జోగిపేట చేనేత సహకార సంఘం ఆవరణలో చైర్మన్ వర్కల అశోక్.. లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశం, అనంత రాజ్, రాజేందర్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట :పట్టణంలోని స్థానిక చేనేత సహకార సంఘం భవనంలో అధ్యక్షులు చింత ఆనంద్ కుమార్ ఆధ్వ ర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘన ంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు,బీఆర్ఎస్ నాయకుడు చింత సాయి నాథ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ చింతాగోపాల్, బీఆర్ ఎస్ టౌన్‌యూత్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, పద్మశాలి పట్టణ అధ్యక్షులు మునిపల్లి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.







అంగన్వాడీల సేవలు ప్రశంసనీయం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని.. బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ వారి ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అంగన్‌వాడి శాఖ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని జిహెచ్ఎంసి మల్టీపర్పస్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన పోషన్ అభియాన్-పోషణ మాసం కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం సామూహిక శ్రీమంతాలు, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోషకాహార లోపంతో ఎదుగుదలలేని పిల్లల సంఖ్య రోజురోజుకి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ బరువుతో పుట్టే పిల్లలు, బలహీనంగా ఉంటే గర్భిణీలు, మాత శిశు మరణాల సంఖ్య తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందన్నారు. గర్భిణీలకు, బాలింతలకు, కిషోర బాలికలకు పోషకాహార ప్రాధాన్యతను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్ర మాలు చేపట్టడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో అంగన్వాడీ కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ విజయకుమార్, ఐసిడిఎస్ ప్రాజెక్టు మేనేజర్ సురేష్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

విభిన్న యోచనే విజయానికి తొలిమెట్టు

గీతం ఆతిథ్య ఉపన్యాసంలో నోవార్టీస్ డైరెక్టర్ డాక్టర్ సుబాస్ చంద్ర మహాపాత్ర



నవతెలంగాణ-పటాన్‌చెరు

'మనకు సౌకర్యంగా ఉన్న వాతావరణం నుంచి బయటకు వచ్చి విభిన్నంగా ఆలోచించాలని, అదే మన విజయానికి తొలి మెట్టు' అని నోవార్టీస్ డైరెక్టర్ డాక్టర్ సుభాస్ చంద్ర మహాపాత్ర అభివర్ణించారు. గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని కెరీర్ గైడెన్స్ సెంటర్(సీజీసీ) ఆధ్వర్యంలో 'ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలో ఆధునిక ధోరణులు' అనే అంశంపై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. స్కూల్ ఆఫ్ ఫార్మసీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయ న.. ఆరోగ్య పరిరక్షణ పురోగతిని విశదీకరించారు. వైద్య పరికరాలు, జీవశాస్త్రం, న్యూక్లియర్ మెడిసిన్, సెల్-జీన్ థెరపీ, వ్యక్తిగత వైద్యం వంటి అనేక అభివృద్ధి చెందుతున్న రంగాలను ప్రస్తావించారు. భవిష్యత్తులో ఆరోగ్య సంరక్షణలో ఈ రంగాలు పోషించే కీలక పాత్రలను వివరించారు. వైద్య పరికరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగమని, పరిశ్రమలో బయోలాజిక్స్ కీలకం కానుందని, న్యూక్లియర్ మెడిసిన్ కొత్త పుంతలు తొక్కుతోందని, సెల్-జీన్ థెరపీ చికిత్సా విధానాలను విప్లవాత్మకంగా మారుస్తున్నాయన్నారు. అంతే కాకుండా, వ్యక్తిగత రోగుల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా చికిత్సను రూపొం దించే వ్యక్తిగతీకరించిన ఔషధాలు కూడా ప్రాముఖ్యతను సంతరిం చుకుంటున్నాయని, ఇవన్నీ ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును రూపొందిస్తున్నాయని డాక్టర్ మహాపాత్ర అన్నారు. డిజిటల్ ఆరోగ్యం, ఔషధ పరిశ్రమలో ఇటీవలి పురోగతిలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్ర గురించి కూడా డాక్టర్ సుబాస్ చర్చించారు. పరిశోధన, అభివృద్ధి, వాణిజ్యీకరణ వంటి రంగాల్లో ఆయా విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ఒక రంగాన్ని ఎంపిక చేసుకుని రాణించాలని సూచించారు. ఫార్మా పరిశ్రమలో బహుముఖ అంతర్ విభాగ పరిజ్ఞానం ఆవశ్యకతను నొక్కి చెబుతూ, ఐటీ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఒక వ్యక్తికి మార్గదర్శి ప్రాముఖ్యతను వివరిస్తూ, ఈ ప్రపంచంలో సమస్త విషయాలూ తెలిసినవారు ఎవరూ ఉండరని, మనకొచ్చే సందేహాల నివత్తి కోసం ఒక మార్గదర్శి ఉండడం చాలా కీలకమన్నారు. విద్యార్థులు తమ అభిరుచికి అనుగుణంగా ఒక రంగాన్ని ఎంపిక చేసుకుని, అందులో అత్యుత్తమ నైపుణ్యం సాధించడంపై దృష్టి పెట్టాలని డాక్టర్ మహాపాత్ర సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా జవాబులిచ్చి, విభిన్న కెరీర్ అవకాశాలను అన్వేషించేలా వారిని ప్రేరేపించారు.తొలుత, స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బప్పాదిత్య ఛటర్జీ అతిథిని స్వాగతించగా, డాక్టర్ రామకంట బాల్,డిప్యూటీ డైరెక్టర్ కెరియర్ గైడెన్స్ సెంటర్ వందన సమర్పణ చేశారు.

నేటి ఛలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి







నవతెలంగాణ-పటాన్‌చెరు, సంగారెడ్డి, సదాశివపేట

నేటి ఛలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య, జిల్లా కార్యదర్శి జి.సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో ఛలో కలెక్టరేట్ ప్రచార జాతను రాజయ్య శుక్రవారం ప్రారంభించారు. అలాగే సంగారెడ్డిలో నిర్వహించిన క్లస్టర్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సాయిలు పాల్గొనగా.. సదాశివపేట పారిశ్రామిక ప్రాంతంలో ఆటో జాత ద్వారా ప్రవీణ్ కుమార్ ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయా సందర్భాల్లో వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. ఆసియా ఖండంలోని సంగారెడ్డి జిల్లా పారిశ్రామిక ప్రాంతంలో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, చట్టపరమైన సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. జిల్లాలో 1710 పరిశ్రమల్లో రెండు లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. అందులో లక్షా అరవై వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని వీరికి కనీస వేతనాలు చట్టపరమైన సౌకర్యాలు అమలు కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత పది రోజుల నుండి కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వేలు, సదస్సులు, దీక్షలు పెట్టి ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం లేదన్నారు. బెంగాల్, బీహార్, చత్తీస్గఢ్, జార్ఖండ్, ఒరిస్సా, మహారాష్ట్ర అనేక రాష్ట్రాల నుంచి సుమారు 70000 మంది వలస కార్మికులు జిల్లాలో పనిచేస్తున్న 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం అమలు నేడు కావడంలేదని, 12 గంటల పని చేయిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్న లేబర్ అధికారులు అటువైపు చూపే లేదని ప్రశ్నించారు. కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించాల న్నారు. రిటైర్డ్ అయిన తర్వాత రూ.9వేలకు పెంచి అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు విఫలమయ్యాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో నేడు రాష్ట్రవ్యాప్తంగా నేడు తలపెట్టిన కలెక్టరేట్ ఎదుట ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మాల్లో పటాన్‌చెరులో కార్మిక నాయకులు శాంతకుమార్, మహేశ్వర్ రెడ్డి, జైపాల్, శ్రీకాంత్, సుధాకర్, మురళి, హాసిఫ్, సంగారెడ్డిలో యాదగిరి, బాలరాజ్, శివ, అలీభాయ్, శ్రీధర్, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి,సదాశివపేటలో సీఐటీయూనాయకులు శ్రీనివాస్, నర్సింలు,కృష్ణమూర్తి,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏవోకు ఘన వీడ్కోలు..



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలో 12ఏండ్లు సుదీర్ఘకాలం పనిచేసి బదిలీపై వెళ్లిన మండల వ్యవసాయాధికారి(ఏఓ) లావణ్యకు స్థానిక రైతు వేదికలో తోటి సిబ్బంది, ఫర్టిలైజర్ డీలర్లు శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సన్మాన కార్యక్రమానికి తహసీల్దార్ భూపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పలువురు అధికారులు, ఫర్టిలైజర్ డీలర్లు హాజరై మాట్లాడుతూ.. 12 ఏండ్లు సుదీర్ఘకాలం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందిం చారన్నారు. అనంతరం గజమాలతో ఘనంగా సన్మాని ంచారు. ఈ కార్యక్రమంలో ఏడి బిక్షపతి, స్థానిక ఏఓ అభినాష్ వర్మ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి, జగనాథ్ రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, రాజేష్, మును పటేల్ తది తరులు పాల్గొన్నారు.

ఆర్కే ఫౌండేషన్ సేవలు..

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన కాజీపల్లిలో ఆర్కే ఫౌండేషన్ నేతృత్వంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ చైర్మెన్ అడ్వకేట్ దండే రమాకాంత్ తెలిపారు. ఈ క్రమంలోనే స్థానికంగా గల గాంధీ విగ్రహం వద్ద నూతనంగా లైటింగ్ ఏర్పాటు, గ్రిల్స్ పునరుద్ధరణ, కలరింగ్ తదితర కార్యక్రమాలను చేపట్టామన్నారు.

తహసీల్‌లో మాయమవుతున్న బర్త్ సర్టిఫికెట్లు



నవతెలంగాణ-వట్‌పల్లి

తహసీల్దార్ కార్యాలయంలో బర్త్ సర్టిఫికెట్ల ఫైల్స్ మాయమవుతున్నాయని.. అర్జీదారులు రోజుల తరబడి తిరుగుతున్నా సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని అందోల్ డివిజన్ వికలాంగుల అధ్యక్షులు సుభాష్ రాథోడ్ ఆరోపించారు. ఈ మేరకు వికలాంగులతో కలిసి తహసీల్దార్ శ్రీనివాసరావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. మేడికుంద తాండాకు చెందిన మీరిబాయ్ తన ముగ్గురు పిల్లలకు సంబంధించిన బర్త్ సర్టిఫికెట్ల కోసం ఆన్లైన్ దరఖాస్తు చేసుకుని.. అనేకసార్లు కార్యాలయం చుట్టూ తిరిగితే ఇద్దరు పిల్లలవి వచ్చాయని.. ఇంకొకరివి ఇప్పటివరకు రాలేదన్నారు. అలాగే సాయిపేటకు చెందిన వ్యక్తి ఆరునెలల క్రితం బర్త్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా నేటికి సర్టిఫికేట్ ఇవ్వలదన్నారు. అంతేకాకుండా కల్యాణ లక్ష్మికి సంబంధించిన ఫైల్స్ కూడా మాయమవుతున్నాయని ఆరోపించారు. ఈ ఘటనలకు బాధ్యులెవరూ అని ప్రశ్నించారు. అంతేకాకుండా సర్టిఫికేట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగితే పొంతన లేని సమాధానాలతో తిప్పి పంపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ప్రజలను ఇబ్బంది పెడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయ సిబ్బందిలో తీరు మారకుంటే గిరిజన సంఘాలతో కలిసి కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేస్తా మన్నారు. అదేవిధంగా కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు రేషన్ డీలర్ల నియమించాల న్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా హద్దులను గుర్తించాలని.. రెవెన్యూ ఆదాయాన్ని కూడా కేటాయించాలన్నారు. తాసిల్దార్ కార్యాలయ సిబ్బందిపై వచ్చే సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY

I.A.No. 2207 of 2019
in
O.S.No. 337 of 2018

BeeramSukkamma and another ...Petitioners/Plaintiffs
AND
P.Prasanna Kumari and others ...Respondents/Defendants

NOTICE

To
M/S. Excellant Developers It's Rep. By Managing Partner Pandiri Viswanatham S/o. P. Venkaiah O/o. Flat.No. 305, Tulasi Residence, Aadarsh Nagar, Sangareddy. ...Respondent No. 3

Whereas, the Petitioner/plaintiff filed the above petition for Impaled to you as Respondent/ Defendant No.3 in the above suit,before the Hon'blePrl. Junior Civil Judge at Sangareddy against you and others, said case is now stands posted on 03-10-2024 for your appearance.

Hence, you are hereby informed to appear before this Hon'ble Court on 03-10-2024 at 10.30 a.m., either in person or though counsel, failing which, the matter will be decided ex-parte as per law.

(By order of the Court)
(K.N. BHASKAR)
Advocate, Sangareddy.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY

I.A.No. 2206 of 2019
IN
I.A.No. 1106 of 2018
IN
O.S.No. 337 of 2018

BeeramSukkamma and another ...Petitioners/Plaintiffs
A N D
P.Prasanna Kumari and others ...Respondents/Defendants

NOTICE

To
M/S. Excellant Developers It's Rep. By Managing Partner Pandiri Viswanatham S/o. P. Venkaiah O/o. Flat.No. 305, Tulasi Residence, Aadarsh Nagar, Sangareddy. ...Respondent No. 3

Whereas, the Petitioner/plaintiff filed the above petition for Impaled as Respondent/ Defendant No.3 before the Hon'blePrl. Junior Civil Judge at Sangareddy against you and others, said case is now stands posted on 03-10-2024 for your appearance.

Hence, you are hereby informed to appear before this Hon'ble Court on 03-10-2024 at 10.30 a.m., either in person or though counsel, failing which, the matter will be decided ex-parte as per law.

(By order of the Court)
(K.N. BHASKAR)
Advocate, Sangareddy.

గౌరవనీయులైన ఎక్సైజ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో సంగారెడ్డిలోని

O.S.No. 702of 2024

మధ్య:
1. కొడిచెర్ల గ్రీష్మ
2. కొడిచెర్ల వర్షిత
3. కొడిచెర్ల ధీరజ్

(P.No.1 నుండి 3 వరకు మైనర్‌లు వారి సహజ తల్లి ద్వారా ప్రాతినిధ్యం వహిస్తారు శ్రీమతి కొడిచెర్ల సుదా రాణి W/o దివంగత కొడిచెర్ల సత్యనారాయణ, వయస్సు 35 సంవత్సరాలు, Occ: గృహిని, R/o.2-85, శివాజీ నగర్, మణికొండ, రాజేంద్ర నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.
...వాదిదారులు
మరియు
సంబంధిత అందరికీ,
...ప్రతివాది

వాదిదారుల సగం వాటా క్రింద పేర్కొన్న సూట్ షెడ్యూల్ ఆస్తిపై యాజమాన్య హక్కులను ఆస్వాదించడానికి చట్టపరమైన స్థితి ప్రకటన కోసం వాది దావా వేశారు. 200 చ. గజాలలో 100/167.22 చ.మీ.లలో 100 అడ్మిషరింగ్ నంబర్ 557 తో కూడిన ఓపెన్ ప్లాట్‌లో అవిభక్త sy.no 122/ భాగం, 119/ భాగం 137/ భాగం, 138, 120, 121/ భాగం మరియు 124/ భాగం శ్రీ మీనాక్షి కౌంటీ యద్దుమైలారం గ్రామం. కంది (M), సంగారెడ్డి (D), సరిహద్దులో ఉంది:
ఉత్తరం: ప్లాట్ నెం: 556 .
దక్షిణం : 12.19 వెడల్పు రోడ్డు.
తూర్పు : 9.14 మీటర్ల వెడల్పు రోడ్డు.
పశ్చిమం: ప్లాట్ నెం. 558.

వారు మరణించిన కోడిచెర్ల యాదమ్మకు చట్టబద్ధమైన వారసులు కావడంతో సంబంధిత వారందరికి వ్యతిరేకంగా సంగారెడ్డిలోని గౌరవనీయ ఎక్సైజ్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు కేసు 01.10.2024న పోస్ట్ చేయబడింది. ఎవరికైన ఆసక్తి లేదా అభ్యంతరాలు ఉన్నాయో వారు హాజరుకావచ్చు మరియు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చు. లేకుంటే విషయం మెరిట్‌పై నిర్ణయించబడుతుంది.

// కోర్టు ఆదేశం ప్రకారం //
పి. మణిక్ రెడ్డి
న్యాయవాది
మల్కాపూర్ ఎక్స్ రోడ్,
కొండాపూర్ మండలం, సంగారెడ్డి జిల్లా
సెల్: 9247735633

IN THE COURT OF THE HON'BLE EXCISE JUDICIAL FIRST CLASS MAGISTRATEAT SANGAREDDY

O.S.No. 702of 2024

Between:
1. Kodicherla Greeshma
2. Kodicherla Varshitha
3. Kodicherla Dheeraj

(P.No.1 to 3 are minors rep by their natural mother Smt. Kodicherla Sudha Rani W/o Late Kodicherla Satyanarayana, Aged 35 years, Occ: House wife, R/o.2-85, Shivaji Nagar, Manikonda, Rajendra Nagar, Ranga Reddy District, Telangana.
... Plaintiffs
AND
All concerned
...Defendant

That the plaintiffs have filed the suit for Declaration of Legal Status to enjoy the ownership rights over the suit schedule property mentioned below All that the undivided half share in **open plot bearing number 557 Admeasuring 100 Out of 200 Sq.yards/ 167. 22 sq.mts in sy.no 122/part, 119/part, 137/part, 138, 120, 121/part and 124/part Sri Meenakshi County situated in Yeddumailaram Village, Kandi (M), Sangareddy (D) bounded by:-**

North : Plot No. 556
South : 12.19 Wide Road
East : 9.14 mts Wide Road
West : Plot No. 558

As they being the legal heirs to deceased **Late Kodicherla Yadamma** against the all concerned before the **HonbleExcise Judicial First Class Magistrate** at Sangareddy and the case is posted on 01.10.2024.Whoever is having interest or objections may appear and raise objections if any, otherwise the matter will be decided on merits.

//BY ORDER OF THE COURT //
P. Manik Reddy
ADVOCATE
Malkapur X Road,
Kondapur Mandal
Sangareddy District
Cell : 9247735633.

నవతెలంగాణ
మెదక్
3
శనివారం | 28 సెప్టెంబర్ 2024 | www.navatelangana.com

ఎన్‌సీసీ వల్ల విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందుతుంది

ఆర్మీ కమాండింగ్ ఆఫీసర్ రమేష్ సరియల్



నవతెలంగాణ-పాపన్నపేట

ఎన్సీసీ వల్ల విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందడమే కాకుండా, క్రమశిక్షణ ఏర్పడుతుందని 33 (టీ) సంగారెడ్డి యూనిట్ ఆర్మీ కమాండింగ్ ఆఫీసర్ రమేష్ సరియల్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన పాపన్నపేట ఎన్‌సీసీ కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాపన్నపేట సీటీఓ ప్రవీణ్ కుమార్‌తో కలిసి మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించడానికి ఎన్‌సీసీ ఒక ప్లాట్‌ఫాంలాగా ఉపయోగపడుతుందన్నారు. ఎన్సీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రిపబ్లిక్ డే శిబిరానికి ఎంపికయ్యే అవకాశం ఉంటుందని సూచించారు. ఎన్సీసీ ఏ సర్టిఫికెట్ విద్యార్థులకు ఉన్నత విద్యకు, పోటీ పరీక్షలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన సూచించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

దాడికి పాల్పడిన దుండగులను శిక్షించాలి



నవతెలంగాణ-టేక్మాల్

మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ యశ్వంత్ రెడ్డిపై దాడిని ఖండిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. టేక్మాల్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అల్లాదుర్గం సీఐ రేణుకకు వినతి పత్రం అందించారు. సొసైటీ పరిధిలో జరుగుతున్న సమావేశానికి ఇతరులు వెళ్లి దాడి చేయడంపై పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గీతా స్కూల్‌లో ప్రజాపాలన దినోత్సవం



నవతెలంగాణ-మనోహరాబాద్

తూప్రాన్ గీతా స్కూల్‌లో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకట కృష్ణారావు జాతీయ జండాను ఆవిష్కరించారు. 1948 ఆగస్టు 17 న తెలంగాణకు పూర్తి స్వాతంత్ర్యం సిద్ధించిందని అప్పటి నుంచి ప్రజలు తమకు తామే స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యయుతంగా పాలించుకునే రోజు వచ్చిందని ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర అధికారిక గేయం "జయ జయహే తెలంగాణ" గీతాన్ని ఉపాధ్యాయుడు, గాయకుడు నరేందర్ ఆలపించారు.

రాంపూర్‌లో నేత్ర వైద్య శిబిరం



నవతెలంగాణ-నిజాంపేట

పరిధిలోని రాంపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం స్వామి వివేకానంద యువజన సంఘం వారి సౌజన్యంతో ఆర్‌వీఎం హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి ఉచిత మందులు అందించామని వివేకానంద యూత్ వ్యవస్థాపకులు ప్రముఖ సంఘ సేవకులు తమ్మలి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అపూర్వ, సంధ్య, అస్రఫ్, మార్కెటింగ్ మేనేజర్ లక్ష్మణ్, పిఆర్ఓ సంతోష్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ టూరిజం డే



నవతెలంగాణ-నిజాంపేట

వరల్డ్ టూరిజం డే సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో నిజాంపేట మండలం రాంపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రధానోపాధ్యాయులు పద్మా రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, చంద్రకాంత్, కుమారస్వామిలు అభినందనలు తెలిపారు.

గీతా విద్యార్థికి జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి



నవతెలంగాణ-మనోహరాబాద్

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, మెదక్ జిల్లా మెడికల్ అసోసియేషన్ వారు మెదక్ జిల్లా కేంద్రంలో సంయుక్తంగా నిర్వహించిన " పోస్టర్ మేళా"లో తూప్రాన్ గీతా స్కూల్ పదవతరగతి విద్యార్థి ఎన్.వినయ్ కుమార్ జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి సాధించాడు. జిల్లా విద్యాధికారి సమక్షంలో జరిగిన ఈ పోటీలలో యువత మాదకద్రవ్యాల ఉపయోగం వల్ల కలిగే అనర్థాలు, ఎయిడ్స్ నివారణ చర్యలకు సంబంధించి పోస్టర్‌తో పాటు విషయ వివరణకు ఈ బహుమతి లభించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్ పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, కె.నారాయణ గుప్త. ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకటకృష్ణారావు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ప్రేంరాజ్ సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, సందీప్, సల్మా కవిత, లీనా, అనిత, ప్రీతి విద్యార్థులను అభినందించారు.

చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరం

- మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-పాపన్నపేట .

చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ప్రతాపరెడ్డి సూచించారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలవల్ల చదువును మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించే అవకాశాలున్నాయన్నారు. ఈ పరీక్షలు రాయడానికి ఈ నెల 30వ తేదీ వరకు ఫీజ్ చెల్లించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ రియాజ్, పద్మ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల ఫోరం సదస్సు

నవ తెలంగాణ-మనోహరాబాద్

విద్యుత్ వినియోగదారుల ఫోరం సదస్సును శనివారం తూప్రాన్ విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్టు తూప్రాన్ డి ఈ రాజేందర్ పేర్కొన్నారు. తూప్రాన్ డివిజన్ పరిధిలోని తూప్రాన్ కలాకల్ శివంపేట వెల్దుర్తి మాసాయిపేట చేగుంట రామాయంపేట నార్సింగి నిజాంపేట 9 సెక్షన్లలోని విద్యుత్ వినియోగదారులు సమస్యల పైన సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సదస్సు నిర్వహించడం జరుగుతుందని వినియోగదారులు సకాలంలో హాజరై సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని డిఈ రాజేందర్ పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేటకు చెందిన గెరుగంటి కుమార్ అనారోగ్యంతో గత కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ మోహన్ నాయక్ శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేలతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిగంటి బాబు, పంజా బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల, గరిగంటి సందీప్, గరుల అశోక్, లంబడి రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరుబిడ్డ, ఉద్యమ జీవి కొండా లక్ష్మణ్ బాపూజీ

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవ తెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సమాజం పట్ల అంకితభావంతో, సేవా దృక్పథంతో, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడిన వ్యక్తి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన తొలి, మలిదశ పోరుబిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన నికార్సైన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. తెలంగాణ సమాజం కోసం జీవించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. తెలంగాణ కోసం, బహుజన వర్గాల హక్కులు, రాజ్యాధికారం కోసం పోరాడిన యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజల అస్థిత్వం కోసం పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్ నాయకుల తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాను పర్యాటక కేంద్రంగా తయారు చేయాలి

- ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

మెదక్ జిల్లాను పర్యాట కేంద్రంగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ఎన్నో పర్యాటక కేంద్రాలు పర్యాటక ప్రాముఖ్యత, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక విలువల గురించి అంతర్జాతీయంగా ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఈ టూరిజం డేను నిర్వహిస్తారన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఎన్నో అందమైన ప్రదేశాలు, చారిత్రాత్మక నిర్మాణాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని, ప్రజలను ఆకర్షించేందుకు కొన్ని టూరిజం ఆర్గనైజేషన్స్ వివిధ రకాల పోటీలను కూడా నిర్వహించడం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు టూరిజం ఎక్కువ ఆదాయం తెచ్చిపెడుతోందన్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని కలెక్టర్ అధికారులు సందర్శించారు. ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేసిన ఫోటోగ్రాఫర్లను సర్టిఫికెట్, మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య జిల్లా అటవీ అధికారి జోజో, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నార్సింగి

మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంచనూరి రాజేష్ తండ్రి కీ శే. అంచనూరి బాలయ్య సంవత్సరీకానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రోహిత్ బాలయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అంచనూరి రాజేష్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాజేష్ కుటుంబానికి ఎల్లవేళలా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర నాయకులు సుప్రభాత రావు, శంకరంపేట్ మాజీ సర్పంచ్ రాజీ రెడ్డి, ఏం.ఎస్.ఎస్.ఓ మండల నాయకుడు చందూ యాదవ్, మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాజేష్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రుక్కుద్దీన్, మండల యూత్ అధ్యక్షుడు బాచి స్వామి, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్ల చిన్న కృష్ణా గౌడ్, దొంతి స్వామి, నర్సింలు గౌడ్, బాలకృష్ణ గౌడ్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలలో శ్రమ దోపిడీని అరికట్టాలి



నవతెలంగాణ-టేక్మాల్

తెలంగాణ రాష్ట్రంలోని కేజీబీవీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల, సిబ్బంది శ్రమ దోపిడిని అరికట్టాలని టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ హీరాలాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం టేక్మాల్‌లోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఆయన ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులను రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు చెల్లించి సర్వీసు రూల్స్ అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న గెస్ట్ ఫ్యాకల్టీ, అవుట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, 317 జీవో ద్వారా వచ్చిన ఉపాధ్యాయులను వారి వారి సొంత జిల్లాలకు పంపించి ఆ ఖాళీల్లో మెదక్ జిల్లా నిరుద్యోగులకు అవకాశాన్ని కల్పించాలని టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ హీరాలాల్ కోరారు. మోడల్ స్కూల్, కేజీబీవీ స్కూల్, ఎల్లుపెట్, వేల్పుగొండ, కమ్మరికత్త, గోడగట్టు పాఠశాల ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందజేశారు . ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చాంద్ పాషా, జిల్లా కౌన్సిలర్లు ఉమామహేశ్వర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు

రైతు వేదికలో ఏకలవ్య ఫౌండేషన్ వార్షిక సమావేశం



నవతెలంగాణ-నార్సింగి

మంజీరా ఉత్పత్తిదారుల సంస్థ ఏకలవ్య ఫౌండేషన్ మూడవ వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో చైర్మన్ బక్కన్నగారి నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్వో షేక్ కరీం, ఎంపీడీవో ఆనంద్, నార్సింగి గ్రామ కార్యదర్శి నాగభూషణం, స్థానిక ఎస్సై అహ్మద్ మొహియుద్దీన్‌లు విశేష అతిథులుగా పాల్గొన్నారు. సర్వసభ్య సమావేశంలో పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ ఇప్పటికే 330 రైతుల సభ్యత్వ నమోదు జరిగిందన్నారు. నూతనంగా సభ్యత్వ నమోదు చేయించు కోవడానికి రైతులు ముందుకు రావాలని కోరారు. అధికారులు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు నిర్వహిస్తున్న పాలకవర్గ సభ్యులకు సేకరించనున్న ధాన్యం కోసం స్థలము, పరికరాలు, ఇతర వసతులు అవసరం ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారినిలు విజృంభన, దివ్య, రమ్య మమత, డైరెక్టర్లు జె స్వామి, కుమ్మరి నరసింహులు, పి శ్రీనివాస్ రెడ్డి, బోండ్ల శ్రీనివాస్, జనార్ధన్, ఎల్లం, టి నరసింహారెడ్డి, శంకర్, అంజనేయులు, బిక్యా నాయక్, ఏకలవ్య ప్రతినిధి సోషల్ మొబిలైజింగ్ ఎక్సపెర్ట్ సంతోష్, సి.ఓ సూర్య తేజ, అకౌంటెంట్ రాశి, పలు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు

కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రోటోకాల్ గురించి మాట్లాడడం విడ్డూరం



నవతెలంగాణ-నార్సింగి

ప్రోటోకాల్ గురించి కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, అంచనూరి రాజేష్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్‌లు మాట్లాడుతూ దుబ్బాకలో జరిగిన కళ్యాణి లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీలు కావాలనే ప్రోటోకాల్ వివాదం చేశారన్నారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పాల్గొన్న కార్యక్రమంలో ప్రోటోకాల్ ప్రకారంగా ఎంపీ, ఎమ్మెల్యేను స్టేజ్ పైకి ఆహ్వానించారని, వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిని స్టేజి పైకి ఆహ్వానించారన్నారు. దానికి బీఆర్ఎస్, బిజెపి వారు అభ్యంతరం తెలిపి శ్రీనివాస్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులకు ప్రోటోకాల్ పై మాట్లాడే అర్హత లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో ఎవరిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు బాచి స్వామి, పట్టణ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, ఫిషర్ మన్ అధ్యక్షుడు గుర్రాల సుధాకర్, ఏం ఎస్ ఎస్ ఓ మండల నాయకులు చందూ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



నవతెలంగాణ-నిజాం పేట

మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. అతని ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్ గౌడ్, రమేష్, శివ, రాజలింగం, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకాంత్ గౌడ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

- ఎంఈఓ ప్రతాపరెడ్డి



నవతెలంగాణ-పాపన్నపేట

ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమని ఎంఈవో ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నరసింగరావు పల్లి గిరిజన తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన శైలజకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ శైలజ పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు.

గిరిజన విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

తాను పనిచేసిన నర్సింగరావుపల్లి గిరిజన తండా విద్యార్థులకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు శైలజ తమ సొంత నిధులతో ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సీనియర్ ఉపాధ్యాయులు అంజాగౌడ్, భట్టు నాగరాజు, సంధ్యారాణి మాజీ విద్యా కమిటీ చైర్మన్ హరి సింగ్, పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డు అందుకున్న శ్రీకాంత్



నవతెలంగాణ-పాపన్నపేట.

ప్రపంచ పర్యటక దినోత్సవ సందర్భంగా ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన పుర్ర శ్రీకాంత్‌కు మెదక్ జిల్లా ఉత్తమ ఫోటోగ్రాఫర్‌గా అవార్డు దక్కగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రశంస పత్రం, మెమొంటోను అందజేశారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి ఫోటోగ్రాఫర్ల పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చారిత్రక స్థలాలు, పర్యాటక కేంద్రాలు ఏకో టూరిజం అంశాలపై ఫోటోలు తీయించగా పాపన్నపేట చెందిన శ్రీకాంత్ ఏడుపాయల క్షేత్రంలోని లక్ష్మీ నగర్ కమాన్ నుంచి ఏడుపాయల వరకు 7 కిలోమీటర్లు క్షేత్రానికి వెళ్లే దారిలో ఏడు రోడ్డు మలుపులు, ఏడు నది పాయలను ప్రత్యేకంగా ఆకర్షణీయమైన ఫోటోలు తీయడం ద్వారా జిల్లాలో ఉత్తమ అవార్డు దక్కింది. ద్వితీయ బహుమతి మెదక్‌కు చెందిన ఈశ్వర్, తృతీయ బహుమతి దర్శు,. నాల్గవ స్థానంలో పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రతాప్‌లు అవార్డులు అందుకున్నారు. వీరికి ఫోటోగ్రాఫర్‌ల యూనియన్ సభ్యులు అభినందించారు.

ప్రజలు ఐక్యంగా ఉండాలి

- సామాజిక, కుల బహిష్కరణలకు తావు లేదు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

ప్రజలు ఐక్యంగా ఉండటమే కొండా లక్ష్మణ్ బాపూజీకి నిజమైన నివాళి అని, సామాజిక కుల బహిష్కరణకు తావు లేదని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి ఉత్సవాలలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజి మహోన్నత వ్యక్తి అని, నిస్వార్థమైన సేవ అంకితభావం కల్గిన గొప్ప వ్యక్తి అన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని సంక్షేమ పథకాల్లో బీసీల వాటా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నాగరాజుగౌడ్, సామాజిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి



నవ తెలంగాణ-టేక్మాల్

ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య, డిప్యూటీ సీఈవో రంగాచార్యులు తెలిపారు. శుక్రవారం టేక్మాల్ మండల పరిషత్ కార్యాలయాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో పలు రికార్డులను వారు పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం వారు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని సూచించా రు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబ లకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో విట్టల్, ఎంపీఓ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో విఠల్, ఎంపివో రియాజ్ దీన్, మండల పర్యవేక్షులు రఘునాథ్ రావు,సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి చెందిన సెంట్రింగ్ ప్లేట్లు చోరీ



నవతెలంగాణ-నార్సింగి

కంపెనీ క్యాంపులో ఉంచిన సెంట్రింగ్ ప్లేట్లు దొంగతనానికి గురైన సంఘటన మండల పరిధిలోని జప్తి శివనూర్ గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారిపై జప్తి శివనూర్ వద్ద ఈ - స్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణ కార్మికులు రోజు మాదిరిగా బుధవారం సాయంత్రం పనులు ముగించుకుని నిర్మాణ పనులకు వాడే పని ముట్లు, సెంట్రింగ్ ప్లేట్లు గ్రామ శివారులోని కంపెని శిబిరంలో ఉంచారు గురువారం 26న ఉదయం కంపెనీ సైట్ ఇంచార్జీ పోచమ్మల ఐలయ్య వచ్చి చూడగా 60 సెంట్రింగ్ ప్లేట్లు కనబడలేదు. క్యాంపు మొత్తం, చుట్టు పక్కల వెతికినా లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలుసుకున్నా రు. చోరికి గురైన సొత్తు విలువ అరవై వేల వరకు ఉంటుందని, కంపెనీ సైట్ ఇంచార్జీ పోచమ్మల ఐలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపారు.

మనోహరాబాద్ మండలంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్

- బీజేపీలో చేరిన మండల పార్టీ అధ్యక్షులు, ఉపసర్పంచులు



నవతెలంగాణ-మనోహరాబాద్

బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు మండల పార్టీ అధ్యక్షులు పురం మహేష్ ముదిరాజ్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీ కండువా వేసుకున్నారు. ఆయనతోపాటు మరి కొంతమంది ఉపసర్పంచ్‌లు, నాయకులు మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు భాష బోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, రాష్ట్ర సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత బీజేపీలో చేరుతున్నట్టు తెలిపారు. అలాగే పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రజా సమస్యల పైన ప్రజలతో కలిసి వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో ముప్పిరెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు సాదు సత్య నారాయణ, కొత్తూరు మహేష్, బాలేష్ యాదవ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్, నర్సిములు ముదిరాజ్, కాళ్ళకల్ గ్రామ అధ్యక్షుడు కొత్తూరు మల్లేష్, కుమ్మరి నాగరాజు మండల నాయకులు, రాకేష్, సాయి బాబా, అనిల్ గౌడ్, వెంకట్ గౌడ, కార్యకర్తలు పాల్గొన్నారు

సరైన సమయంలో బస్సులు నడపాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జగన్



నవతెలంగాణ- తూప్రాన్

మండల కేంద్రంలో పలు కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం సరైన సమయానికి బస్సులు రాకపోవడం వల్ల తూప్రాన్ బస్ డిపోలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి బస్సు డిపో అధికారులకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ గజ్వేల్ నుంచి వచ్చే బస్సులు ఉదయం సమయపాలన పాటించడం లేదని మండిపడ్డారు. అలాగే వెల్దుర్తి బస్సు గత కొద్దిరోజులుగా రాకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సంగారెడ్డి నుంచి వచ్చే బస్సులు సాయంత్రం వేళలో సమయానికి రావడంలేదని, దీని ద్వారా విద్యార్థులు రాత్రి 7 గంటలకు ఇంటికి చేరుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా మెదక్ డిపో మేనేజర్ స్పందించి బస్సులు నడిపించాలని తెలియజేశారు. లేనిపక్షంలో తూప్రాన్ మండల కేంద్రంలో విద్యార్థుల ఆధ్వర్యంలో ఇక్కడికక్కడే బస్సులను నిలిపివేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల గర్ల్స్ కన్వీనర్ శ్వేత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలకు పాదయాత్రగా చేరుకున్న భవాని భక్తులు



నవతెలంగాణ-పాపన్నపేట

పాపన్నపేట భవాని మాల ధరించి దీక్ష చేపట్టిన స్వాములు 65 కిలోమీటర్ల పాదయాత్ర చేసి ఏడుపాయలకు శుక్రవారం చేరు కున్నారు. నారాయణఖేడ్ మండ లం కొండాపూర్ సంగ్రహం మహారాజ్ ఆశ్రమం నుంచి పది మంది భవాని మాత మాల ధరించిన స్వాములు ఏడుపా యల వన దుర్గ భవాని అమ్మవారి దర్శనానికి పాదయా త్రగా బయలుదేరారు. బాచారం గ్రామానికి చేరుకో గానే భజరంగ్‌దళ్ నాయకులు బొలకృష్ణ ఆధ్వర్యంలో స్వాములకు అల్పా హారాన్ని అందజేశారు. పాదయాత్రగా అమ్మవారి క్షేత్రం చేరుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

బాపూజీ జయంతి వేడుకల్లో హరీశ్‌రావు

• నివాళులు అర్పించిన హరీశ్ రావు

నవతెలంగాణ-సిద్దిపేట



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా సిద్దిపేట పట్టణ సిరిసిల్ల రోడ్‌లో గల ఆయన విగ్రహానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు, జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)శ్రీనివాస్ రెడ్డిలు పులా మాల వేసి నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మణ్ బాపూజీ సేవలను కొనియాడుతూ, ప్రజా సంక్షేమం కొరకు తన మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త అని, తెలంగాణ తిరుగుబాటులో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధుడని, తెలంగాణ ఉద్యమకారుడని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగత్ కుమార్ రెడ్డి, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు కస్తూరి సతీష్, రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ బూర మల్లేశం, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కాముని రాజేశం, కార్యదర్శి బి. మల్లేశం, పట్టణ సెక్రటరీ చేర్యాల మల్లికార్జున్, మున్సిపల్ మాజీ చైర్మెన్ కడవేరుగు రాజనర్సు, కౌన్సిలర్ యోగేశ్వర్, రవితేజ, మురళీకృష్ణ, రాజ్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరలు కేంద్రం నియంత్రించాలి

• హుస్నాబాద్‌లో సీపీఐ నాయకుల ధర్నా

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



నిత్యావసర వస్తువల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం నిత్యవసరాలు ధరలు నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపే మల్లేష్ మాట్లాడుతూ పేదలకు బీజేపీ ప్రభుత్వం ఓ వైపు కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేస్తూ మరో వైపు నిత్యవసర ధరలను పెంచుతూ పేద ప్రజల నడ్డి విరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిత్యవసర వస్తువులు సరిపడ నిలువ ఉన్న కొరతను సృష్టించి ధరలను పెంచుతున్నారని ఆరోపించారు. వెంటనే పెరిగిన ధరలను వెంటనే నియత్రించాలని లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ -నంగునూరు



నంగునూరు మండలం నర్మెట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ లింగంపల్లి లచ్చవ్వ మృత దేహానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు రావు నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. అదేవిధంగా గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త గందమల్ల ఎల్లయ్య, నాయిని పుష్ప ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను హరీశ్ రావు పరామర్శించారు.

ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య

• ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య

నవతెలంగాణ-మిరుదొడ్డి



ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం అక్బురుపేట-భూంపల్లి మండలంలోని అక్బురుపేట ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థులతో కలిసి మధ్యన భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికరమైన భోజనం అందిస్తుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా అందించాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతుల కొరత ఉంటే తనతో చెప్తే సమస్యలను తీరుస్తానని ఉపాధ్యాయులకు చెప్పారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

రోగ నివారణలో నీరు ఒక ఔషదం

• ఎంపీడీవో గణేష్ రెడ్డి

నవతెలంగాణ-మిరుదొడ్డి



మనిషికి నీరు ప్రాణదారమని, ప్రజల రోగ నివారణలో నీరు ఒక ఔషదం లాగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీడీవో గణేష్ రెడ్డి అన్నారు. మిరుదొడ్డి మండలం కేంద్రంలోని రైతు వేదికలో మిషన్ భగీరథ మంచినీటి సహాయకులకు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీటి పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పల్లెల్లోని ప్రజలు శుద్ధమైన మంచినీటిని తాగడం వలన ఆరోగ్యాలు బాగుంటాయని సూచించారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న విషయాలు గ్రామ ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శిక్షణ తరగతులు నాలుగు రోజులు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-నంగునూరు



వ్యవసాయ పొలం వద్ద ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన కరెడ్ల రాంచంద్రారెడ్డి (59) అనే రైతు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రాజగోపాల్ పేట పోలీసుల కథనం ప్రకారం...రాంచంద్రారెడ్డి శుక్రవారం పొద్దున వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లి, బోర్ మోటార్ పని చేయకపోవడంతో స్టాటర్ నుంచి ట్రాన్స్ ఫార్మర్ వరకు ఉన్న వైర్లను పరిశీలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. ఆయన ఎంతకు ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు అతనికి ఎన్ని సార్లు ఫోన్ చేసిన స్పందించలేదు. కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా కరెంట్ షాక్ కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య నాగవ్వ, నలుగురు కుమార్తెలు ఉన్నారు.రాజగోపాల్ పేట ఎస్సై ఎం.డి. అసిఫ్ సంఘటన స్థలానికి చేరుకుని పంచునామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై రాజగోపాల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టారు.

ఆయిల్ పామ్ పంటల కోతలు ప్రారంభం

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని ఇప్ప లగూడెం గ్రామానికి చెందిన సామల సంజీవ రెడ్డి పొలంలో శుక్రవా రం ఆయిల్ పామ్ పంట మొదటి కోతను కోశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి టి.నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ గెల పరిమాణము బరువు, ఆశించిన మేరకు వచ్చిందని, రైతు సాగు చేస్తున్న 10 ఎకరాలలో సుమారు 4 నుంచి 5 టన్నుల దిగుబడి రావడానికి అవకాశం ఉందన్నారు. ఈ గెలలను నంగనూరు మండలంలోని నర్మెట్ట ఫ్యాక్టరీకి తరలిస్తారని చెప్పారు. రైతు సంజీవరెడ్డి పంట రావడంతో ఆనందం వ్యక్తం చేశారు, మిగతా రైతులు కూడా ఈ ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రావాలని మన ప్రాంతానికి అనుకూలమని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్, ఆయిల్ ఫెడ్ అధికారి విజయ్, రైతులు, తదితరులున్నారు.

ప్రజలను పక్కా దారి పట్టిస్తున్న హరీశ్ రావు

• రాష్ట్ర యుత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ

నవతెలంగాణ-సిద్దిపేట



రాజీనామా అంశం పక్కకు బెట్టి, ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తున్న హరీశ్ రావు నిన్ను ఎవరు నమ్మే స్థితిలో లేరని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ అన్నారు. సిద్దిపేట కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నంగనూర్ మండలంలో రైతు రుణమాఫీ పై ధర్నా పెట్టి ప్రజలకు మాయమాటలు చెపుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి ఇష్ట రీతిగా మాట్లాడటం చాలా సిగ్గు చేటని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మీరు ప్రజలకు చేసింది ఏమి లేదని, అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రాష్ట్రాని భ్రష్టు పట్టిచారని అన్నారు. సీఎంను విమర్శించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ కలిమోద్దీన్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీమ్, మెరుగు రాజు, సాయి ప్రతాప్, అంజిరెడ్డి, జనర్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-కొండపాక



మండల పరిధిలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లు సిబ్బందికి కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం స్వచ్చత హి కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శ్రీధర్, ఆయుర్వేద డాక్టర్ రజిని, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపిఓ విష్ణు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కోహెడ



మండల కేంద్రానికి చెందిన బండారి ప్రభాకర్ ఇటీవల అనారో గ్యంతో మృతి చెందగ శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులకు ఎస్ఎస్సీ 1991-1992 బ్యాచ్ చిన్ననాటి మిత్రులు రూ. 55.1 వేలను అందజేశారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు











నవతెలంగాణ-మద్దూరు

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను కళాశాల ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాపూజీ ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

స్వాతంత్ర్యం, నిజాం నిరంకుశ వ్యతిరేక, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం చేపట్టిన మూడు దశల ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీని జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు దేవ స్వామి కొనియాడారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణంలో బాపూజీ జయంతి వేడుకలను బోధన సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించింది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డీనేటర్ ప్రవీణ్ రెడ్డి, అధ్యాపకులు సదానందం, రాజా రమణారావు, సుమన్ రాజా కళ్యాణ్, వెంకట నాగేశ్వర్, చంద్రశేఖర్, శివకుమార్, సలారుద్దీన్, సరిత విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి మాట్లాడుతూ బాపూజీ సేవలు మరువలేనివని మూడు తరాల ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించినట్టు తెలిపారు. తెలంగాణ ప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఆయన న్యాయవాద విద్య ఆదేశించి నిజం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గలం విప్పి తెలంగాణ విముక్తి పోరాటంలో పాల్గొని మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష కోసం పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ జక్కి ఉద్దీన్, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, శీర్ల శ్యామల మల్లేష్ యాదవ్, బొగ్గుల చందు, కో ఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్, మున్సిపల్ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక

స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం దుబ్బాక పట్టణంలోని పద్మశాలి భవన్‌లో పద్మశాలి సమాజం అధ్యక్షులు జిందం గాలయ్య ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సమాజం కార్యవర్గ సభ్యులు, పలు పాండీల పెద్దలు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా హైదరాబాదులోని గాంధీభవన్‌లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు చేనేత విభాగం సెల్ చైర్మెన్ గూడూరు శ్రీనివాస్ తెలిపారు. బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నేత, బలహీనవర్గాల స్ఫూర్తి ప్రదాత, తెలంగాణ ఉద్యమంలో తమదైన పాత్ర పోషించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చేనేత సెల్ నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడేందుకు ఆదేశాల కొరకు వినతి

• డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

నవతెలంగాణ-గజ్వేల్



పౌరహక్కుల దినం రోజు బతుకమ్మ ఆడని గ్రామాల్లో బతుకమ్మ ఆడేవిధంగా అవగాహన కల్పించేందుకు అధికారులకు ఆదేశాలివ్వాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారి యస్ .కె అబ్దుల్ రహమాన్ కు వినతిపత్రాన్ని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులు ఇచ్చి తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏగొండ స్వామి మాట్లాడుతూ పున్నయ్య కమిషన్ సిఫారసు ప్రకారం ప్రతి నెల చివరి రొజున పౌరహక్కుల దినోత్సవం జరిపి ప్రతి పౌరునికి తమ,తమ హక్కులను, సమానత్వం ఒకటే అన్నారు. మహిళలు డాక్టర్ లు, ఇంజనీర్‌లు, హిమాలయ పర్వతం సైతం అదిరోస్తున్నారు. కాని పక్కనే ఉన్న తోటి మహిళలతో బతుకమ్మ ఆడలేక అవమాన పడుతున్న పరిస్థితుందన్నారు. అందులో బాగంగా ఈ నెల జరిగే పౌరహక్కుల దినోత్సవాన్ని బతుకమ్మ ఆడని గ్రామలైన గజ్వేల్ మండల్‌లో అహ్మదీపూర్, బెజగామ, ప్రజ్ఞాపూర్, మక్తామాసన్ పల్లి, రాయపోల్ మండల్ లింగారెడ్డి పల్లి,మంతూర్ దౌల్తాబాద్ మండల్ తిర్మలాపూర్, మిరుదొడ్డి మండల్ అల్వాల్, మల్లుపల్లి భూంపల్లి-అక్బర్ పేట్ మండల్ మెతె మర్క్యాక్ మండల కేంద్రం ,శివారు వెంకటాపూర్ గ్రామాల్లో బతుకమ్మ ఆడె విధంగా అదేశాలివ్వాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.

క్రీడలతో శారీరక,మానసిక ఉల్లాసం

• రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య



నవ తెలంగాణ-దుబ్బాక

క్రీడలు శారీరక ధారుడ్యాన్ని పెంచడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోను రాణించాలని అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేటవ లోని మోడల్ స్కూల్ లో రెండు రోజులపాటు నిర్వహించనున్న "68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీల" ను మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమి రెడ్డి, వార్డు కౌన్సిలర్లు బంగారయ్య, నందాల శ్రీజ శ్రీకాంత్ లతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, ఎమ్మార్వో వెంకటరెడ్డి, ఎంఈఓ ప్రభుదాస్, మోడల్ స్కూల్ ప్రిన్స్ పాల్ సామలేటి బుచ్చిబాబు, కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి, మండలంలోని ఉపాధ్యాయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

• డీపీఓ దేవకీదేవి



నవతెలంగాణ-కొండపాక

పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని జిల్లా పంచాయతీ అధికారిని దేవకీదేవి అన్నారు. స్వచ్చత హీ సేవా కార్యక్రమంలో భాగంగా దుద్దెడ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. విద్యార్థులకు పరిశుభ్రత ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతపై నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీ ఓ విష్ణు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి

నవతెలంగాణ-కొమురవెల్లి



మండలంలోని తపాస్ పల్లి ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంఈఓ బొమ్మ గోని రమేష్‌తో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలించి నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. డీఈఓకు బీజేపీ మండల ఉపాధ్యక్షులు ఈగ కనకయ్య పాఠశాలకు శాశ్వత ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని, విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా ఉపాధ్యాయులు లేరని ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు డీఈఓ శ్రీనివాస్ రెడ్డినీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంకణాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

మహిళల భద్రతకు అందుబాటులో పోలీసులు

నవతెలంగాణ-కొండపాక



మహిళల భద్రతకు పోలీసులు ఎప్పుడు అందుబాటులో ఉంటారని షీ టీం బృంద పోలీసులు పేర్కొన్నా రు. కొండపాక లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ స్కూల్లో విద్యార్థులకు శుక్రవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఉన్న చట్టాలను వివరించారు. ర్యాగింగ్ ఈవ్ టీజింగ్, పొక్సో, యాంటీ హ్యుమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుకునూరు పల్లి ఏఎస్ఐశంకర్, గజ్వేల్ షీటీమ్ బృందం ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుళ్లు రాంచంద్రారెడ్డి, మహేష్, భరోసా సెంటర్ సిబ్బంది హరిత, వినోద, సోనీ, ప్రిన్సిపల్ కవిత తదితరులు పాల్గొన్నారు.

యువ టూరిజం క్లబ్బు ఆధ్వర్యంలో పర్యాటక దినోత్సవం

నవతెలంగాణ-గజ్వేల్



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్ లోని యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ మాట్లాడుతూ పర్యాటకం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుంద న్నారు. పర్యాటక దినోత్సవ కార్యక్ర మం నిర్వాహకులైన వైస్ ప్రిన్సిపాల్ హిస్టరీ విభాగం అధిపతి గణపతి రావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని టూరిజం శాఖ పోర్టల్ లో కళాశాల యువ టూరిజం క్లబ్ రిజిస్టర్ అయినట్లు తెలియజేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం ఆవిర్భావం గూర్చి టూరిజం ప్రాముఖ్యతను గూర్చి తెలిపారు. ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ డి.వెంకటేష్ మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రగతికి పర్యాటక రంగం దోహద పడుతుందన్నారు. అకాడమిక్ కోఆర్డినేటర్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ విద్యార్థి పర్యాటక రంగ అభివృద్ధికి తన వంతు కృషి చే యాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మండలాల విద్యాధికారులు బాధ్యతలు

నవతెలంగాణ-మిరుదొడ్డి



మిరుదొడ్డి, అక్బర్ పేట- భూంపల్లి మండలాల విద్యాధికా రులు బాధ్యతలు చేపట్టారు. రెండు మండలాల ఇన్చార్జి ఉన్న ప్రభుదాస్ దుబ్బా కకు ట్రాన్స్ఫర్ కాగా, మిరుదొడ్డి మండల ఎంఈఓగా ప్రవీణ్ బాబు, అక్బర్ పేట-భూంపల్లి మండలం ఎంఈఓ గా అంజాగౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్య వ్యవస్థను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి పాఠశాలను పర్యవేక్షించి, విద్యార్థులకు చక్కటి విద్యతో పాటు, నాణ్యమైన భోజనాన్ని అందే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

30న జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-సిద్దిపేట

అక్టోబర్ 8న, 9న హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కు ఈనెల 30న స్థానిక స్టేడియం మైదానంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అండర్14, 16, 18, 20 విభాగాల్లో బాల, బాలికలకు వేరు వేరుగా జిల్లా ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. 100, 800, 3000 మీటర్స్ రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, ఇతర అంశాల్లో పోటీలు ఉంటాయనీ, ఆసక్తి గలవారు పుట్టిన పత్రం లేదా పదవ తరగతి మెమో జీరాక్స్ కాపీ తీసుకొని ఈనెల 29న సాయంత్రం 6 గంటల లోపు అథ్లెటిక్స్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు నిషాంక్ గౌడ్ 8501977079, లీలాఆనంద్ 9666020322, 9704061543 నెంబర్లను సంప్రదించాలని సూచించారు

29న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-సిద్దిపేట



ఈ నెల 29 న ఎస్సీ, ఎస్టీ చైర్మెన్ బక్కి వెంకటయ్యాకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్డ్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు జి మహంకాళి తెలిపారు. ప్రెస్ క్లబ్ గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ 16వ వార్షికోత్సవం సందర్భంగా 29న సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో సన్మానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హాజరు కానున్నారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలోని వెంకటయ్య అభిమానులు, శ్రేయోభిలాషులు, షెడ్యూల్డ్ క్యాస్ట్ సంఘ నాయకులు, కుల సంఘాల పెద్దలు, ఉద్యోగులు ఈ సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జి రామస్వామి, జి కనకమల్లయ్య, పొనమల్ల రాములు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-రాయపోల్




వరి పంటలో తెలుగులో నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ పరిధిలోని వరి పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రత్తి ,వరి పంటలలో వచ్చే చీడ పీడల తెగుళ్ల నివారణ కోసం రైతులకు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించటం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, కంపునల్లి, గింజ మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున రైతులు క్లోర్ ఫైరిఫాస్ 20శాతం ఈసీ 400 మీ లీ ం ప్రోపికొనజోల్ 25శాతం ఈసి 200 మీ.లీ ఎకరానికి కలిపి పిచికారి చెయ్యటం ద్వారా నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్ నరేష్, రైతులు రాజు పాల్గొన్నారు.

పంటల పరిశీలన.. రైతులకు సూచన..

• వ్యవసాయ శాఖ మండల అధికారి శ్రీనాథ్..


నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



సిద్దిపేట అర్బన్ మండలం బక్రీ చెప్యాల, వెల్కటూర్ గ్రామాలలో శుక్రవారం వ్యవసాయ శాఖ మండల అధికారి శ్రీనాథ్ పర్యటించి వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటకు ఎటువంటి రోగాలు వస్తాయి ఎటువంటి మందులు వాడాలి అనే విషయంపై రైతులకు అవగాహన కల్పించారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

నవతెలంగాణ-మద్దూరు



మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా చేసే సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్డబ్ల్యూఎస్ చేర్యాల డీఈఈ కిషన్ తెలిపారు. సందర్భంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి అక్టోబర్ 01 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో పైప్ లైనుల మారమ్మత్తు లు, చేతి పంపు రిపేర్, గ్రామ పంచాయతీ మంచినీటి పంపు సెట్టులు ఎలా రిపేర్ చేయాలి, మంచినీటి పై అవగాహనా కార్యక్రమంలు నిష్ణాతుల ద్వారా ప్రాక్టికల్‌గా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, వాటర్ మ్యాన్, కారోబర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

- మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ పట్టణాన్ని స్వచ్ఛ హుస్నాబాద్ పట్టణంగా తీర్చిదిద్దడంలో ప్రజలందరి భాగస్వామ్యం కావాలని మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా సైక్లతాన్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీ చౌరస్తా లో గాంధీ విగ్రహం చుట్టూ మానవహారంలా ఏర్పడి స్వచ్ఛతాపై, పర్యావరణంపై, చెత్త విభజనపై, ప్లాస్టిక్ నిషేధంపై డ్రాయింగ్ గీసిన చార్ట్ ను ప్రదర్శిస్తూ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ కవర్లు నిషేధించి జ్యూట్ బ్యాగులను వాడాలని సూచించారు. చెత్తను తడి చెత్త పొడి చెత్త, హానికరమైన చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ , కౌన్సిలర్స్ దొడ్డి శ్రీనివాస్, బొజ్జ హరీష్ , స్కూలు ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

సరైన పోషణతోనే ఆరోగ్య తెలంగాణ

- చైర్ పర్సన్ వనిత

నవతెలంగాణ-దుబ్బాక



సరైన పోషణతోనే ఆరోగ్య తెలంగాణ సాధ్యమని.. గర్భిణీలు, చిన్నారులు పోషకాహారాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని 18వ వార్డు నీలకంఠ సమాజ భవనంలో "ఐసీడీఎస్ దుబ్బాక ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్ పర్సన్ వనిత హాజరైనారు. అనంతరం గర్భిణీలకు పోషకాహార పదార్థాలను ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తూ పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఎల్లయ్య, మెడికల్ సిబ్బంది,ప్రయిమరీ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ యశోద,హెల్త్ సూపర్వైజర్ శ్యామల, పోషన్ దుబ్బాక బ్లాక్ కో-ఆర్డినేటర్ శ్యాంసన్, ఐసీడీఎస్ సూపర్వైసర్లు చంద్రకళ, ఏఎన్ఎం, ఆశలు, గర్భిణీలు, బాలింతలు, దుబ్బాక సెక్టార్ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే స్థల పరిశీలన

నవతెలంగాణ-బెజ్జంకి




మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శ విద్యాలయాల్లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్థల పరిశీలన చేశారు. ఆదర్శ విద్యాలయంలోని వంట గదికి ఎమ్మెల్యే తన స్వంత ఖర్చులతో గ్యాస్ సిలిండర్లు అందజేశారు. ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ, వైస్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, అనుబంధ కమిటీల నాయకులు, అయా విద్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణీ, బాలింతలు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి

- చేర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి రమాదేవి

నవతెలంగాణ-చేర్యాల



గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు చిరుధాన్యాలు, ఆకుకూరలను ఆహారంగా తీసుకోవాలని చేర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి రమాదేవి తెలిపారు. చేర్యాల మండల కేంద్రంలోని చేర్యాల సెక్టార్ పరిధిలో 9వ వార్డు అంగన్వాడీ సెంటర్ 8లో శుక్రవారం పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనకు నిత్యవసర పరిసరాలలో దొరికే కూరగాయలు, పండ్లు, నిమ్మ, జామ, చింతకాయ, మొలకెత్తిన విత్తనాలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. పిల్లలు బరువు తక్కువగా లేకుండా మంచి ఆహారం ఇవ్వాలని కోరారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగమణి, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకునిపై కేసు

- ఎస్ఐ రవికాంత్ రావు

నవతెలంగాణ-తొగుట

పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని మోసం చేసిన యువకునిపై కేసు నమోదు చేశామని తొగుట ఎస్ఐ రవికాంత్ రావు తెలిపారు. శుక్రవారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మిరుదొడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి తొగుట గ్రామానికి చెందిన సిలివేరి నరేష్ గౌడ్ గత మూడేళ్లుగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని తెలిపిందన్నారు. యువత వద్ద ఉన్న ఆరుతులాల బంగారం, రూ. 2.30 లక్షలు తీసుకు న్నాడని, తర్వాత పెళ్లి చేసుకోమని అడగగా చేసుకోను అని బుకాయించడాని చేపిందన్నారు. ఇట్టి విషయము గురించి పెద్ద మనసుల సమక్షంలో మాట్లాడిన నరేష్ డబ్బులు ఇవ్వడం లేదని బాధితురాలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిందని అన్నారు. ఈ విషయం పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


చోరీకి పాల్పడిన నిందితుడికి జైలు శిక్ష

నవతెలంగాణ-వర్గల్

మండలంలోని అంబర్ పేట్ గ్రామానికి చెందిన వల్లపు రాజు (29) అదే గ్రామంలో ఆగస్టు 8న రాత్రి సమయంలో కొంతమంది ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డాడు. నిందితుడిని పోలీసులు గుర్తించి ఆగస్టు 30న అరెస్టు చేసి రిమాండ్ కి తరలించారు. నిందితుడి పై చార్జ్ షీట్ వేసి కోర్టులో హాజరు పరిచారు. పూర్తి విచారణ జరిగి తరువాత నేరం రుజువైంది. గజ్వేల్ ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి చోరీకి పాల్పడిన నేరస్తుడికి. రూ 4వేలు జరిమానా, ఏడాది కాలం పాటు జైలు శిక్షను విధించారు. ఈ సందర్భంగా ఈ కేసులోని నిందితుడిని తొందర గుర్తించి, శిక్షపడేలా చేసిన గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణని అధికారులు అభినందించారు.

రక్త దానం చేసి మానవత్వాన్ని చాటుకున్న కానిస్టేబుల్

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



రక్త దానం చేసి మానవత్వాన్ని చాటుకున్న సిద్దిపేట రూరల్ కానిస్టేబుల్ రాజు చిన్నకోడూర్ మండలం రామంచ గ్రామానికి చెందిన మహిళ సిద్దిపేట ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అత్యవసరంగా ఆపరేషన్ సమయంలో బి పాజిటివ్ బ్లడ్ అవసరము ఉన్నదని పోలీస్ మిత్రులు ద్వారా సమాచారం రావడంతో వెంటనే సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజు వెంటనే స్పందించి సిద్దిపేట ఎస్ఎస్వి బ్లడ్ బ్యాంక్ వెళ్లి బ్లడ్ రక్తదానం చేయడం జరిగింది. రక్తదానం చేసిన రాజుకు కుటుంబ సభ్యులు, పలువురు అభినందనలు తెలియజేశారు.

వార్డు సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని 31వ, 32వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వైస్ చైర్మెన్ జంగిటి కనకరాజు మున్సిపల్ అధికారులను కోరారు. శుక్రవారం వార్డులో సమస్యలు ఏఈ అన్వేష్‌కి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేది బతకమ్మ పండగ కాబట్టి వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు


నవతెలంగాణ-మద్దూరు



స్వచ్ఛత హి సేవలో భాగంగా దూల్మిట్ట గ్రామ పంచాయతీలో దూల్మిట్ట లింగాపూర్ జాలపల్లి, తోర్నాల, పారిశుద్ధ కార్మికులకు మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య బృందంతో రక్త, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, డాక్టర్ రజిత, కార్యదర్శి లు సిద్దేశ్వరులు, రాజు గౌడ్, పున్న శ్రీనివాస్, ఏఎన్ఎం స్వరూప, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కేఆర్ఆర్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



దుబ్బాక మండల పరిధిలోని అప్పనపల్లి గ్రామానికి చెందిన గ్యార భూలక్ష్మి ఇటీవల వ్యవసాయ కూలి పనికి వెళ్లి పాము కాటుకు గురై మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కేఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి బాధిత కుటుంబాన్ని శుక్రవారం కలిసి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల క్రితం మృతిరాలి భర్త అనారోగ్యం కారణంగా మృతి చెందారని, తాజాగా భూలక్ష్మి మరణంతో వారిద్దరు కూతుర్లు అనాధలయ్యారు. కార్యక్రమంలో వారి వెంట మాజీ సర్పంచ్ పోషాద్రి యాదవ్, ఎంపీటీసీ యాదగిరి, ఏఎంసి డైరెక్టర్ రాజిరెడ్డి, కొండి రాజిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు నర్సింహులు, కనక రెడ్డి, చిర్ర తిరుపతి పాల్గొన్నారు.

నేటి తరం యువతకు బాపూజీ స్ఫూర్తిదాయకం

నవతెలంగాణ-గజ్వేల్




సమాజంలో అట్టడుగున నిలిచిన పేదల అభ్యున్నతికి కృషిచేసిన మహనేతని, నేటి తరం యువతకు పూజ్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం స్ఫూర్తిదా యకమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో అట్టడుగు నిలిచిన పేదల అభ్యున్నతికి ఆయన కృషి చేయగా, తెలంగాణ ఉద్యమంతో పాటు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అన్ని వర్గాలను చైతన్యం చేసినట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమం తో పాటు ముల్కీ ఆందోళనలో పాల్గొన్న ఆయన వంటి మహనీయుడు దేశంలోనే చాలా అరుదని చెప్పారు. తెలంగాణ ప్రజలకు సంపూర్ణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఫలాలు అందిన నాడే నిజమైన నివాళి దక్కినట్లు అవుతుందని వివరించారు.

ప్రాధాన్య రంగాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి

నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్



ప్రాధాన్యం కలిగిన రంగాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అన్నారు. శుక్రవారం సమీ కృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, జిల్లాలోని వివిధ బ్యాంకు అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పథకంలో కొన్ని బ్యాంకులు అధార్‌లో తప్పుల సవరణ ఇతర కారణాలతో జాప్యం చేస్తున్నందున అసహనం వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారుల పనితీరు మార్చు కోకుంటే వారిపై ఎస్-ఎల్‌బీసీకి కంప్లైంట్ చేస్తానని హెచ్చరించారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈ జీపీ, ఎస్ఎచ్‌జీ లింకెజీలను త్వరితగతిన పూర్తి చేయాలి. ఇప్పటి వరకు ఈ సంవత్సరం లో ఎస్ఎచ్‌జి లో రూ.894 కోట్లకు గాను రూ.750 కోట్లు పూర్తి మిగతా టార్గెట్ కూడా వేగంగా పూర్తి చెయ్యాలని సూచించారు. పీఎం- స్వానిధి, పీఎం- విశ్వకర్మ ప్రక్రియ సైతం వేగంగా పూర్తి చెయ్యాలి. ఈ సంవత్సరం చంద్లాపూర్ గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలందిస్తున్నట్లు అలాగే తునికి కలస గ్రామంలో కొత్త బ్రాంచ్ ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లక్పత్ దీది పథకం ద్వారా ప్రతి ఎస్ హెచ్ జి గ్రూప్లో ఒకరికి రూ.1లక్ష నుంచి రూ. 5లక్షల ఎటువంటి సెక్యూరిటీ లేకుండా లోన్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. అగ్రికల్చర్ ఇన్ఫ్రా ఫండ్ లో రాష్ట్రంలోనే జిల్లా రెండవ స్థానంలో నిలిచినందుకు గాను నాబార్డు వారు అందించిన మెమెంటో ను కలెక్టర్ చేతులమీదుగా ఎల్డీఎంకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం హరిబాబు, ఆర్బీఐ ఐడీఓ తాన్య, యూబీఐ ఆర్ఎచ్ వికాస్, ఎపీజీవీబీఆర్ఎం ఉదయ్ కిరణ్, డీసీసీబీ డీజీఎం విశ్వేశ్వర్, టీజీబీ ఆర్ఎం బాలనాగు, ఆర్సెట్టి డైరెక్టర్ రాజలింగం, నాబార్డు డీడీఎం నికిల్ పాల్గొన్నారు.

పిల్లల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు దోహదం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

నవతెలంగాణ- ములుగు




పిల్లలు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా పరిణతి చెంద డానికి, చదువుతో పాటు క్రీడలు ఎంతో దోహద పడతాయని ఉపాధ్యా య శాసనమండలి సభ్యులు కూర రఘోత్తం రెడ్డి అన్నారు. మండలం లోని తునికి బొల్లారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాదికారి ఉదయ భాస్కర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శ్రీలతతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే గేమ్స్ మండలంలోని 14 పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎంతో ఉందని, వారి సహకారంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంన్నారు. పాఠశాలల పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రామ్ నర్సయ్య , ఉపాధ్యాయులు అమర్ నాథ్, గ్రామస్తులు దేవేందర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, నరేశ్ గౌడ్, ఏకాంబర్ రెడ్డి, పోచిరెడ్డి, వీరారెడ్డి, అశోక్ , ప్రతినిధులున్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ

నవతెలంగాణ-రాయపోల్




ప్రభుత్వ కార్యక్రమంలో పార్టీ నాయకులను ఆహ్వానిస్తూ ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారుపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ డిమాండ్ చేశారు.గురువారం రాయపోల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘన పై చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి ప్రోటోకాల్ ఉల్లంఘన చేశారన్నారు. ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధం లేని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిని వేదిక మీద కూర్చోబెట్టారు. స్థానిక ఎమ్మెల్యే పలుమార్లు ప్రోటోకాల్ పాటించని వారికి కిందికి పంపించాలని మైక్ ద్వారా చెప్పినా, అధికారులు స్పందించలేదన్నారు అధికారుల ప్రోటోకాల్ ఉల్లంఘన మూలంగా ఉద్రిక్తలకు కారణ మవుతుందన్నారు. వేదిక వద్ద ఏర్పాటుచేసిన చేసిన ఫ్లెక్సీలో ప్రజాప్రతి నిధులవి పోటోలు వేయడంలో ప్రోటోకాల్ పాటించాలేదని ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలను, ప్రోటోకాల్ ఉల్లంఘన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లింగంపల్లి యాదగిరి, మాజీ సర్పంచ్ కరుణాకర్, మాజీ ఎంపీటీసీ రాజు గౌడ్, మాజీ ఉపసర్పంచ్ మల్లేశం, నాయకులు రంగారెడ్డి, బాల నర్స్, మురళి ,తిరుపతి నర్సింలు, వెంకటరెడ్డి, నవీన్ గౌడ్, బాలరాజ్ గౌడ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్ష

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి


నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్



వానాకాలం ధాన్యం కొనుగోలు 2024-25 పై జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి శుక్రవారం ఐడీఓసీలోని సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నవంబర్ 2024 నుంచి జనవరి 2025 నాటికి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పంట రానుందని అందుకు అనుగుణంగా 417 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడ ఎటువంటి సమస్యలకు తావులేకుండా ముందుగానే ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ధాన్యం గ్రేడ్- ఎ రకం ప్రతి క్వింటాలుకు రూ.2320 లు, ఇతర సాధారణ రకాలు ప్రతి క్వింటాలుకు రూ.2300లు నిర్ణయించిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్ లు, గన్ని సంచుల కొరత లేకుండా ముందుగానే సమకూర్చుకోవడంతో పాటు అవసరం మేర అదనంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రాధాన్యత క్రమంలో కొనుగోలు కేంద్రాలను గుర్తించి ఆటోమేటిక్ డ్రయ్యర్ మిషన్‌లను తెప్పించడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో 3641 మిల్లింగ్ కెపాసిటీ గల 148 రైస్ మిల్లులు ఉండగా వాటికి కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించడంలో ట్రాన్స్ పోర్ట్ సమస్యలు తలెత్తకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. 2023-24 సీఎంఆర్ పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, సివిల్ సప్లై అధికారి తనూజ, డీఎం సివిల్ సప్లై అధికారి ప్రవీణ్, పిడి మెప్మా హన్మంత్ రెడ్డి, రవాణాశాఖ అధికారి శంకర్ నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పత్తి, వరి పంటల పరిశీలన

నవతెలంగాణ-జగదేవపూర్




జగదేవపూర్ మండలంలోని బస్వాపూర్, తిమ్మాపూర్ గ్రామల లోని పత్తి, వరి, మొక్కజొన్న పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి వసంతరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటివల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలకు చీడపీడల బెడద పెరుగుతున్నట్టు గమనించి రైతులకు తగు సూచనలు చేశారు. పత్తి పంటలో రసం పిలిచే పురుగులు, పొగాకు లద్దె పురుగును గమనించినట్లు దీని నియంత్రణకు రైతులు ఎకరానికి మీటరు1లీటర్ వేప నూనెను (1500 పీపీఎం) గానీ లేదా ఇమిడ క్లోప్రిడ్ 60 మిల్లీలీటర్లు గాని లేదా అసిట మాప్రైడ్ 100 గ్రాములు గాని లేదా అసిఫేట్ 300 గ్రాములు గాని 200 మీటర్ల నీటిలో కలిపి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పై మందులు మార్చి పిచికారి చేసుకోవాలని అలాగే పొగాకు లద్దె పురుగును నియంత్రించడానికి లార్విన్ ను 200 గ్రాములు గాని లేదా ఫ్లుబెండ మైడ్ 60 గ్రాములు ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు. వరిలో బ్యాక్టీరియల్ ఆకు ఎండు తెగులు ను నివారించడానికి1 గ్రాము ప్లాంట మైసిన్, 30 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను 10 లీటర్ల నీళ్లలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి కిరణ్, రైతులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ బైక్‌తో వాతావరణ కాలుష్య నియంత్రణ

- మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్


నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



రానున్న కాలంలో పెట్రోల్‌తో నడిచే బైక్‌లు కాకుండా ఎలక్ట్రానిక్ బైక్‌లు వాడితే వాతావరణ కాలుష్య నియంత్రణ చేయవచ్చని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఏడీఎంఎస్ ఎలక్ట్రిక్ బైక్ షోరూంను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడు తూ పర్యావరణం కాలుష్యం కాకుండా ఉండానికి బ్యాటరీ బైక్‌లు ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. బ్యాటరీతో నడిచే బైక్‌లను పరిశీలించిన ఆయన వాటి పనితీరును అడిగి తెలుసుక న్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ప్రజాప్రతి నిధులు, షోరూం నిర్వాహకులు గుంటిపల్లి అజయ్, పెద్దపల్లి రవీందర్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత, అన్వర్ ,శ్రీనివాస్ ,సురేష్ నాయకులకు కార్యకర్తలకు పాల్గొన్నారు

పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు


నవతెలంగాణ-బెజ్జంకి



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆవరణంలో పంచాయతీ కార్మికులకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో వైద్యం శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించామని ఎంపీడీఓ ప్రవీన్ శుక్రవారం తెలిపారు. వైద్యాధికారి వినోద్ బాబ్జీ, ఇంచార్జీ వైద్యురాలు భాగ్యలక్ష్మి, ఎంహెచ్ఎస్ సులోచన, సిబ్బంది గోపాల్ రెడ్డి హజరయ్యారు.

ఎంఈఓగా మహతి లక్ష్మి బాధ్యతలు

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని రేగులపల్లి ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్న మహతి లక్ష్మి శుక్రవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యలయంలో ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట ప్రవీన్ కుమార్, ఎస్టీయూ మండలాధ్యక్షుడు నారోజు శంకరా చారి, ప్రధాన కార్యదర్శి రామంచ రవీందర్ ఎంఈఓను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు.

ఉపాధ్యాయ హేతుబద్ధీకరణ జీవోను రద్దు చేయాలి

నవతెలంగాణ-మర్కుక్




ఉపాధ్యాయ హేతుబద్ధీకరణ జీవో నెం 25ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని టీపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పి. బాల్ రెడ్డి, పి.వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయున్ని నియమించలన్నారు. ప్రభుత్వమే విద్యావ్యవస్థను కాపాడాలన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి

-కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు


నవతెలంగాణ- సిద్దిపేట అర్బన్



ప్రభుత్వ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆహ్వానిస్తూ ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు దుబ్బాక మాజీ జడ్పీటీసీ రవీందర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించి అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘించారని ఈ సందర్భంగా కలెక్టర్, కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డికి అవకాశం కల్పించి వేదికపైకి పిలిచిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పై ప్రోటోకాల్ ఉల్లంఘన చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోటోకాల్ పాటించాలని సిబ్బందికి సూచించిన పట్టించుకోలేదని అన్నారు. దీంతో సభలో శాంతిభద్రతల సమస్య ఏర్పడిందని తెలిపారు. ప్రోటోకాల్ ఉల్లంఘించి శాంతిభద్రతలకు సమస్యలు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు తోట కమలాకర్ రెడ్డి, జీడిపల్లి రాంరెడ్డి, పాల సాయిరాం, మోహన్ లాల్, కొత్త కిషన్ రెడ్డి, శేర్ల కైలాసం, తదితరులు పాల్గొన్నారు.

'డిజిటల్ లావాదేవీలు - సైబర్ మోసం'


నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ హైదరాబాద్ సహకారంతో "డిజిటల్ లావాదేవీలు - సైబర్ మోసం" అనే అంశంపై శుక్రవారం విజయవంతంగా వర్క్‌షాప్ నిర్వహించారు. సెషన్‌లో రిసోర్స్ పర్సన్ రాధిక భరత్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, హైదరాబాద్, డిజిటల్ బ్యాంకింగ్ యుగంలో పెరుగుతున్న సైబర్ మోసాల బెదిరింపుల గురించి విద్యార్థులు అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్ లక్ష్యం. రాధికా భరత్ డిజిటల్ బ్యాంకింగ్‌లో సురక్షిత పద్ధతులపై ఒక ప్రెజెంటేషన్‌ను అందించారు, ఈ ప్రెజెంటేషన్ లో ఆన్‌లైన్ మోసాల నివారణను హైలైట్ చేస్తూ ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో వ్యక్తిగత ఆర్థిక సమాచారాన్ని భద్రపరచడానికి విలువైన సూచనలు అందించారు. ఆర్థిక అక్షరాస్యత నైపుణ్యాలను సురక్షితమైన డిజిటల్ పద్ధతులను ప్రోత్సహించడానికి కళాశాల కొనసాగుతున్న ప్రయత్నాలలో భాగమే అన్నారు.. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి శ్రీలత, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఏ. బాలచంద్రం, డాక్టర్ ఎంఎం లక్ష్మి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మర్కుక్ ఎంఈవోకు సన్మానం


నవతెలంగాణ-మర్కుక్



మర్కుక్ మండల నూతన ఎంఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎ.వెంకట రాములును శుక్రవారం మర్కుక్ ఎంఆర్సీలో టీపీటీఎఫ్ మర్కుక్ మండల పక్షాన శుభాకాంక్షలు తెలియజేసి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమ ంలో జడ్పీహెచ్ ఎస్ చేబర్తి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకర్ రెడ్డి, జడ్పీహెచ్ఎస్ మర్కుక్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, జడ్పీహెచ్ఎస్ పాములపర్తి ప్రధానోపాధ్యాయులు షేక్ లతి సైదా , టీపీటీఎఫ్ మర్కుక్ మండల అధ్యక్షులు పి.బాల్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి పి.వెంకటయ్య, నరసింహారావు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-తొగుట




సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం గుడికందులకు సంబంధించి సీఎం రిలీఫ్ పండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ మాధవ నేని రఘునందన్ రావు గుడికందులకు సంబంధించి జిలాల్ పురం కనకవ్వ రూ.15 వేలు, అంగడి కావ్య రూ.13 వేలు ,చిన్నరంగారి అజయ్ రూ.13500 చెక్కులు పంపిణీ చేశామని తెలిపారు.

అధికార అహంకారంతో ప్రోటోకాల్ బేఖాతార్

-బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు హైమద్

నవతెలంగాణ-మిరుదొడ్డి



అధికారంలో ఉన్నామని అహంకారంతో కాంగ్రెస్ నాయకులు ప్రోటోకాల్‌ను పాటించడం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు హైమద్ అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాటా్లడుతూ..అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నప్పటికీ ప్రజల పక్షాన ఉండాల్సిన పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మంత్రి కొండ సురేఖ ఆధ్వర్యంలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగినప్పటికీ బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు దాడులకు తెగబడడం ఏంటని ప్రశ్నించారు. శాంతి భద్రతలను కాపాడే పోలీసులే అత్యుత్సాహం ప్రదర్శించడం సరైంది కాదన్నారు. నిబంధనలు పాటించకుండా వ్యవహరించిన కాంగ్రెస్ గుండాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగం, బాలరాజు, సత్యనారాయణ, రాములు ,సత్తయ్య పలువురు పాల్గొన్నారు.

నంగునూరులో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం

నవతెలంగాణ-నంగునూరు




నంగునూరు గ్రామ పంచాయతీలో శుక్రవారం స్వచ్ఛత హే సేవా కార్యక్రమం చేపట్టారు. డ్వాక్రా గ్రూప్ మహిళలు, ఉపాధి హామీ కూలీలతో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం అనే నినాదం పై స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు మాత్రమే వాడాలని, ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.లక్ష్మప్ప, సీనియర్ అసిస్టెంట్ మజహర్, పంచాయతీ కార్యదర్శి వి.చంద్రకళ, సీసీ మల్లేశం, ఏఎన్ఎం సామ్రాజ్యం, గ్రామ స్థాయి అధికారులు(వీఓఏ), అంగన్వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, కారోబార్ బి.అశోక్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది అరాచక పాలన

-బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి

నవతెలంగాణ-మిరుదొడ్డి



కాంగ్రెస్ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి అన్నారు. కాంగ్రెస్ నాయకులు నిబంధనలను తుంగలో తొక్కి రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. అక్బర్ పేట- భూంపల్లి మండలలో బీఆర్ఎస్ నాయకులతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో పాల్గొన్న మంత్రి కొండ సురేఖ ప్రోటోకాల్ పాటించకుండా వ్యవహరి ంచడం సరికాదన్నారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో విచ్చలవిడిగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శాంతియుత వాతావ రణంలో జరగాల్సిన కార్యక్రమంలో అల్లర్లు సృష్టించే విధంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించారన్నారు. పోలీసులతో బీఆర్ఎస్ నాయకులపై దాడులకు కాంగ్రెస్ నాయకులు తెగబడ్డారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకు లు మల్లారెడ్డి ,శ్రీనివాస్ గౌడ్ ,కృష్ణ, పరశురాములు పలువురు పాల్గొన్నారు.


అధికారుల నిర్లక్ష్యం వలనే రైతు మృతి

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం ఘణపూర్ గ్రామానికి చెందిన కర్రెడ్ల రామచంద్ర రెడ్డి అనే రైతు కరెంటు షాక్ గురై మృతి చెందడం పట్ల కరెంటు అధికారులే బాధ్యత వహించాలని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజి మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డిలు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఘణపూర్ గ్రామంలో కర్రెడ్ల రామచంద్రారెడ్డి తన వ్యవసాయ బావి దగ్గర కరెంటు వైర్ తగిలి చనిపోయాడు. కరెంటు అధికారులు కొత్త స్తంబాలు వేయకపోవడంతో దూరంగా ఉండటం వల్ల అక్కడి నుంచి రెండు నుంచి మూడుపోళ్లకు దూరంగా సర్వీస్ వైర్ ఉండటం వల్ల ఈ ప్రమాదం వాటిల్లిందని అన్నారు, రామచంద్ర రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అవసరం ఉన్న చోటఇప్పటికైనా కొత్త పోలు వేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు.

అవాలతో కొండ లక్ష్మణ్ చిత్రాన్ని అద్భుత చిత్రం


నవతెలంగాణ-గజ్వేల్



ఉద్యమ శిఖరం, స్వాతంత్ర సమరయోధుడు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా వినూతంగా అవాలను ఉపయోగించి అత్యంత అద్భుతంగా కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రాన్ని చిత్రించి శుక్రవారం రామకోటి రామరాజు ఆయన కార్యాలయంలో ఆవిష్కరించి ఘన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ విముక్తికి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు కృషి చేసిన అలుపెరగని పోరాట యోధుడు, ఉద్యమ జీవి కొండ లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు.

మెదక్ ఎంపీని కలిసిన బుద్ధ మహేందర్

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బుద్ధ జ్యోతి మహేందర్ శుక్రవారం ఉమ్మడి మెదక్ ఎంపీ రఘునందన్ రావును హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేందర్ ను రఘునందన్ రావును శాలువాతో సత్కరించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ గ్రామానికి చెందిన యువకుడు నందకిషోర్ చారి అనారోగ్యం కారణంగా శుక్రవారం మృతి చెందాడు విషయం తెలుసుకున్న స్థానిక తాజా మాజీ ఎంపీటీసీ కవిత శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. కుటుంబానికి మనోధైర్యాన్ని నింపి, అండగా ఉంటామని అన్నారు. అనంతరం కుటుంబానికి కవిత శ్రీనివాస్ రెడ్డి రూ.3 వేలు, బుద్ధ నాగరాజు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ వార్డు సభ్యులు బుద్ధ చిన్న సత్యం నాయకులు శ్రీను గౌడ్, ప్రశాంత్‌లు తదితరులు ఉన్నారు.